

సామర్లకోట మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా సునేత్రాదేవి 6

మా గోడు వినండి మహాప్రభో! 7

చెందుర్తి సెంటర్‌లో భారీ దారిదోపిడీ

వర్తకుడిని అడ్డగించి కొట్టి బంగారు వస్తువుల చోరీ

మెయిన్‌లో..



జయలక్ష్మి వచ్చేనా!

జయలక్ష్మి సొసైటీ శఠగోపం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో జయలక్ష్మి సొసైటీ కుంభకోణం బాధితులు ఈసురోమంటున్నారు. స్కాం జరిగి మూడేళ్లు దాటేసినా న్యాయం జరగక లబోదిబోమంటున్నారు. పోగొట్టుకున్న సొమ్ము చేతికి రాక విలవిల్లాడుతున్నారు. ఇంట్లో పిల్లల పెళ్లిళ్లు తదితర కారణాలకు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక నరకయాతన పడుతున్నారు. సీజ్ చేసిన రూ.450 కోట్ల విలువైన ఆస్తుల్లో కొంతైనా వేలం వేసి చిన్న డిపాజిటర్లకు డబ్బులు చెల్లించే వీలున్నా సీఐడీ కనీసం ఆ దిశగా ప్రయత్నం చేయక పోవడంతో బాధితులు అల్లాడుతున్నారు. నష్టపోయిన వారికి చెల్లించడానికి కనీసం 40 శాతం రూ.200 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్ శాన్ మోహన్ సైతం లేఖ రాసినా ఉలుకూపలుకు లేదు. మరో పక్క డిపాజిటర్ల సొమ్ము రూ.43 కోట్లు కొట్టేసి లండన్ పారిపోయిన ఉదయ శంకర్‌ను సీఐడీ ఇప్పటికీ వెనక్కు రప్పించలేక పోయింది. దీంతో తమకెప్పుడు న్యాయం జరుగుతుందంటూ డిపాజిటర్లు రోదిస్తున్నారు. దీనిపై కాకినాడ కలెక్టర్ శాన్ మోహన్ వివరణ కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, సాధ్యమైనంత వరకు భూముల వేలం లేదంటే రూ.200కోట్లు మంజూరయ్యేలా మళ్లీ ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు.

సూత్రధారులు వీళ్లే..

కుంభకోణానికి ప్రధాన సూత్రదారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్ష్మి, డైరెక్టర్లు రాయవరపు జయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబ్రహ్మణ్యకుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్ నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించి నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు. 159 మంది నిందితులపై సీఐడీ కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచింది. వీరికి సంబంధించిన 98 ఆస్తులకు చెందిన రూ.450 కోట్ల విలువైన స్థిరాస్తులను సొసైటీ చొరవతో సీఐడీ సీజ్ చేసి కోర్టుకు సమర్పించింది. రుణాలు తీసుకున్న 235 మందిపై ట్రిబ్యునల్‌లో కేసు నమోదు చేయగా ఇప్పటివరకు 40 మందిపై కోర్టులో నెంబర్ దాఖలైంది.

ఏళ్ల గడుస్తున్నా న్యాయమేది?

ఈ కుంభకోణానికి సంబంధించి ఇప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదు. స్వాధీనం చేసుకున్న ఆస్తులను వేలం వేసి డిపాజిట్‌దారులకు చెల్లింపులు జరిగేలా సీఐడీ ప్రయత్నం చేయాలి. కానీ అదేదీ ఇంకా జరగలేదు. రెడ్ కార్నర్ నోటీసు ద్వారా ఉదయశంకర్‌ను అరెస్ట్ చేసి అప్పుడు వేలం వేయాలని సీఐడీ భావిస్తున్నా అది సాధ్యం కావడం లేదు. ఇదిలా ఉండగా బాధితులకు 40 శాతం కింద రూ.200 కోట్లు తక్షణం విడుదల చేయాలని గతేడాది అక్టోబరులో జిల్లా కలెక్టర్ శాన్‌మోహన్ డీజీపీకి లేఖరాశారు.తద్వారా చిన్న డిపాజిటర్లకు మేలు జరుగుతుందని వివరించారు. చిరు డిపాజిటర్లను దృష్టిలో ఉంచుకుని రూ.200 కోట్లు మంజూరు చేయడం పెద్ద కష్టమైన పనే కాదు.స్థిరాస్తుల వేలం లేదా తాత్కాలిక సర్దుబాటు కింద నిధులు మంజూరు చేసి డిపాజిటర్లకు చెల్లించాల్సి ఉండగా, సీఐడీ కనీసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం లేదు. గత నెలాఖరులోగా 25 శాతం మేర బాధితులకు నగదు పంపిణీ చేసే విధంగా కృషి చేస్తున్నట్టు పాలకవర్గం ప్రకటించినా జరగలేదు. దీంతో న్యాయం కోసం బాధితులు రోడ్డెక్కుతున్నారు. ఇప్పటికే 80మంది చనిపోయారు.కనీసం మృతి చెందిన కుటుంబాలను ఆదుకునేందుకు పాలకవర్గం,అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఎవరెవరు ఎంతిచ్చారు..

వాస్తవానికి బాధితుల్లో ఎక్కువగా రూ.లక్షలోపు డిపాజిట్‌దారులు 13,249 మంది ఉండగా రూ.32.72 కోట్లు చెల్లించాల్సి ఉంది. రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల్లోపు డిపాజిటర్లు 2,384 మంది ఉండగా రూ.37.83 కోట్లు చెల్లించాలి. రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల్లోపు 810 మంది ఉండగా వీరికి రూ.27.99 కోట్లు, రూ.5 లక్షల్లోపు బాధితులు 677 మందికి రూ.30.41 కోట్లు, రూ.5 లక్షలు ఆపైన 2,563 మంది ఉండగా వీరికి రూ.349 కోట్లు చెల్లించాలి.రూ.582 కోట్ల కుంభకోణంలో వైస్ చైర్మన్ విశాలాక్ష్మి ఒక్కరే ఎటువంటి సెక్యూరిటీ లేకుండా బినామీలతో సుమారు రూ.300 కోట్లు కొట్టేయడం గమనార్హం.

రూ.582 కోట్లు కొట్టేశారు...

కాకినాడ రూరల్‌లోని సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా 1999లో ఏర్పాటైన ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సంస్థ మూడున్నరేళ్ల కిందట ఖాతాదారులకు నిలువునా శఠగోపం పెట్టింది. అధిక వడ్డీల ఆశ చూపించి ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ, కృష్ణా, విశాఖ జిల్లా ల్లో 29 బ్రాంచిల ద్వారా 19,600 మంది నుంచి రూ.582 కోట్ల వరకు డిపాజిట్లు వసూలు చేసి బిచాణీ ఎత్తేసింది. బాధితుల ఆందోళనలతో జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు విచారణ పూర్తి చేసి రూ.582 కోట్ల మేర ఆర్థిక మోసానికి పాల్పడినట్టు గుర్తించారు. 348 పేజీల నివేదికను 2023లో ప్రభుత్వానికి అందించారు. 19 వేల మంది నుంచి రూ.458 కోట్లు డిపాజిట్లు సేకరించినట్టు, 2,245 మందికి రూ.455.78 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తేల్చారు. రుణాల్లో కేవలం రూ.120 కోట్లకు మాత్రమే లెక్కలుండగా మిగిలి నవన్నీ బినామీ రుణాలుగా గుర్తించారు. ప్రధానంగా 49 మంది రుణాల కింద రూ.43.04 కోట్లు వైస్ చైర్మన్ విశాలాక్ష్మి మేనల్లుడు ఆకెళ్ల ఉదయశంకర్ నొక్కేశాడని గుర్తించారు. లండన్ పారిపోయిన ఉదయశంకర్‌ను రప్పించేందుకు సీఐడీ అధికారులు రెడ్‌కార్నర్ నోటీసు సైతం జారీ చేశారు.

- రూ.582 కోట్ల కుంభకోణం
- మూడేళ్లు దాటినా నేటికీ అంతే
- రూ.450 కోట్లు ఆస్తులు సీజ్
- అమ్మేసే వీలున్నా అడుగులు నిల్
- రోడ్డెక్కుతున్న బాధితులు
- డిపాజిటర్లు 19,600 మంది
- ఇప్పటికే 80 మంది మృతి
- రూ.200 కోట్లకు కలెక్టర్ ప్రయత్నం
- అయినా కానరాని స్పందన

సీఎం చంద్రబాబును కలుస్తాం..

త్వరలోనే సీఎం చంద్రబాబును కలుస్తాం. బాధితుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయాలి. ఇప్పటికీ ఒక్క కేసుకీ సేల్ ఆర్డర్ రాకపోవడంతో బాధితులు ఆందోళనలో ఉన్నారు. రూ.300 కోట్ల ఆస్తులపై ట్రిబ్యునల్‌కి వెళ్లగా 11 కేసులకు కోర్టు డిక్రీ ఇచ్చింది.తీర్పు తొందర్లో వస్తే వెంటనే ఆస్తుల వేలం నిర్వహిస్తాం.

- గంగిరెడ్డి త్రినాథరావు, సొసైటీ చైర్మన్

న్యూఢిల్లీకి పయనమైన జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),జూలై28(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం న్యూఢిల్లీకి పయనమై వెళ్లారు. మంగళవారం ఆయన కేంద్ర హోంశాఖలో ఉన్నతాధికారులను కలుస్తారు. ఉప్పాడ తీరప్రాంత కోత నివారణకు కట్టడాలు నిర్మించడానికి రూ.323కోట్లు నిధుల విడుదలకు ఆయన అధికారులతో సంప్రదింపులు చేస్తారు. ఉప్పాడతీర ప్రాంతంలో సముద్ర కోతవల్ల జరిగే నష్టాన్ని కేంద్రంలో ఉన్నతాధికారులకు వివరిస్తారు. అనంతరం ఈనెల 30వతేదీ న్యూఢిల్లీనుంచి తిరిగి కాకినాడకు బయలుదేరుతారు. కాకినాడ జేసీ రాహుల్‌మీనా జిల్లాలో అధికారిక కార్యక్రమాలను రెండురోజులపాటు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం

- మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ మద్యపానం, జూదక్రీడలు, పశు అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు: ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, జూలై 28(ఆంధ్రజ్యోతి): అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై జిల్లా పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపింది. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశానుసారం రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కఠిన చర్యలను అవలంబిస్తోంది. ఇందులోభాగంగా మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారిపై, జూదక్రీడలు, కోడి పందేలు, అక్రమ పశువుల రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసి మూడు వాహనాలను సీజ్ చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతున్న 10 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ చలానా విషయంలో 248 కేసులు నమోదు చేసి రూ.62,580 జరిమానా విధించామని సోమవారం రాత్రి ఎస్పీ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగంగా మద్యం తాగినా, పేకాట, కోడిపందేలు ఆడినా.. ఏ ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్పొరేషన్‌లో అంతర్గత బదిలీలు

- పూర్తిస్థాయి బదిలీలు ఎప్పుడు చేస్తారని ప్రశ్నిస్తున్న పలువురు ఉద్యోగులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ ఎస్టాబ్లిష్‌మెంట్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో సోమవారం ముగ్గురు ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ కమిషనర్ భావన ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ బదిలీలు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. రెవెన్యూ విభాగం సీనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మిని ఏ1 నుంచి 101 సెక్రటేరియట్ సెల్, పీ-4 సర్వే, స్వర్ణ ఆంధ్ర-2047ను పర్యవేక్షించే బాధ్యతను అప్పగించారు. రెవెన్యూ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్ ఏ-9గా పనిచేస్తున్న డీవీఎస్‌ఆర్‌కే కిషోర్‌ను అదే సెక్షన్‌లో ఏ1 అసిస్టెంట్‌గా నియమించారు. జూనియర్ అసిస్టెంట్ ఎ.భాగ్యవతిని ఏ3 రెవెన్యూ సెక్షన్ నుంచి ఏ9 అసిస్టెంట్ పదవికి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఇన్‌చార్జ్‌గా బదిలీ చేశారు. ఈ బదిలీపై కొందరు ఉద్యోగులకు పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కార్పొరేషన్‌లో పూర్తిస్థాయి అంతర్గత బదిలీలు జరిగి ఎన్నో ఏళ్లవుతున్నా ఉన్నతాధికారులు దానిపై దృష్టిసారించకుండా అవకాశం, అనుకూలతలను బట్టి పరిపాలనా సౌలభ్యం పేరుతో బదిలీలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కొంతమంది ఉద్యోగులుసైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదోన్నతులు వచ్చినప్పటికీ సీనియర్ ఉద్యోగులు పనిభారం తగ్గించుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా ఐఏఎస్‌స్థాయిలో ఉన్న కమిషనర్ హయాంలో పూర్తిస్థాయి అంతర్గత బదిలీలు చేపడితే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

ఐడీ కార్డుపై ఒకలా.. సదరం సర్టిఫికెట్‌పై మరోలా నమోదు

- కలెక్టర్‌కు దివ్యాంగుడి వినతిపత్రం

కలెక్టరేట్(కాకినాడ), జూలై 28(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్లపై తప్పుగా నమోదువ్వడంతో జిల్లాలో దివ్యాంగులు ఆందోళనచెందుతున్నారు. కాకినాడ ఏటిమొగకు చెందిన మైలా ధర్మారావు దివ్యాంగుడు కాగా గత ప్రభుత్వం జారీ చేసిన యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డుపై వినికిడి లోపంగా నమోదైంది. దీంతో సదరం సర్టిఫికెట్ల రీవెరిఫికేషన్‌లో పింఛన్ రద్దుచేస్తారోమోననే ఆందోళన చెందుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చాడు. సర్టిఫికెట్‌పై ఆర్థోపెడిక్‌సమస్యగా పేర్కొని ఐడీకార్డులో వినికిడి లోపంగా నమోదుచేయడంతో ఆందోళన వ్యక్తంచేశాడు. ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్‌పై ఒకలా, ఐడీ కార్డుపై మరోలా వైకల్యం ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించాడు. తన జీవనానికి ఇదే ఆధారమని పింఛన్ లేకపోతే బతకలేనని వాపోయారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నరసింహ నాయక్‌ను సంప్రదించగా జిల్లావ్యాప్తంగా 38వేల పింఛన్లు సదరం రీవెరిఫికేషన్ జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో తప్పులను గుర్తించి పరిష్కరిస్తామన్నారు.

కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు

- రికార్డుస్థాయిలో 921 అర్జీలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 28(ఆంధ్రజ్యోతి): అర్జీదారులతో కాకినాడ కలెక్టరేట్ పోటెత్తింది. రికార్డుస్థాయిలో వెయ్యిమంది అర్జీదారులు, సహాయకులతో కలెక్టరేట్ ప్రాంగణం కిటకిటలాడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అర్జీదారులు క్యూకట్టారు. గత సోమవారం పీజీఆర్‌ఎస్ రద్దు చేయడంతో దాని ప్రభావం ఈ సోమవారం పీజీఆర్‌ఎస్‌పై చూపింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలను అధికారులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్‌మీనా, డీఆర్‌వో వెంకట్రావు, ఎస్‌ఎస్‌ఏ పీవో వేణుగోపాల్‌రావు, సీపీవో త్రినాథ్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, జీజీహెచ్ ఎస్డీసీ శ్రీధర్ వినతిపత్రాలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో సంతృప్తిస్థాయిని పెంచేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. వివిధ అంశాలపై 921అర్జీలు వచ్చాయన్నారు. ఇక్కడకు రాలేని వారుమీకోసం వెబ్‌సైట్ ద్వారా అర్జీలను నమోదు చేసుకోవచ్చన్నారు. పెద్దఎత్తున వచ్చిన అర్జీదారులు క్రమసంఖ్య లిఖించేవద్ద గుమిగూడడంతో అధికారులకు పెనుసవాల్‌గా తయారైంది.



కలెక్టరేట్ ఆవరణలో వేచి ఉన్న అర్జీదారులు

'పోలీస్ గ్రీవెన్స్'కు 65 అర్జీలు

కాకినాడక్రైం,జూలై 28(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ జిల్లావ్యాప్తంగా 65మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఎస్పీ బిందుమాధవ్ అర్జీదారుల సమక్షంలోనే పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను, సబ్‌డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చన్నారు.

రైస్.. రైట్..

- జిల్లాలో పలుచోట్ల బియ్యం అక్రమ నిల్వలు
- పట్టుబడుతున్నా.. ఆగని అక్రమార్కులు
- కేసులు నమోదవుతున్నా అదే పంథా
- వైసీపీ హయాంలో చక్రం తిప్పిన వారే ఇప్పుడూ తెరవెనుక వ్యాపారం
- జిల్లాలో 8నెలలుగా పట్టుబడిన రేషన్ బియ్యం 47,148 టన్నులు
- వాటి విలువ రూ.220కోట్లు
- మొత్తం 85 కేసులు నమోదు



కాకినాడ రూరల్ వలసపాకలలో ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యం

(కాకినాడ ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రూ.5,27,077 విలువ చేసే 11 టన్నుల 355 కిలోల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు జూలై 8న స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమబియ్యం వ్యాపారం చేస్తున్న ఇద్దరిపై 6ఏతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేశారు.

కాకినాడ రూరల్ మండలం వలసపాకలు, వాకలపూడిలో 5.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జూలై 20న ఆదివారం రాత్రి సివిల్ సప్లయీస్ అధికారులు పట్టుకున్నారు. అక్రమ తరలింపునకు సిద్ధంగా ఉన్న 14 రైస్ బస్తాలను స్వాధీనం చేసుకుని బియ్యాన్ని నిల్వ ఉంచిన వ్యక్తిపై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేశారు.

రెండువారాల వ్యవధిలో కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పలుచోట్ల రేషన్‌బియ్యం పట్టుబడ్డాయి. ఇక్కడేకాదు.. పిఠాపురం, తుని, పెద్దాపురం, జగ్గంపేట ఇలా దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లోనూ రేషన్ బియ్యం పట్టుబడుతూనే ఉన్నాయి. పౌరసరఫరాలశాఖ అధికారులు 6ఏ తోపాటు పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నా.. రేషన్‌మాఫియా తగ్గడం లేదు.

రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ రేషన్ మాఫియాకు చెక్‌పెట్టామని చెప్తున్నారు. బియ్యం అక్రమ ఎగుమతిదారులపై పీడీ యాక్ట్ తీసుకొచ్చామని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామంటున్నారు. 6ఏతోపాటు భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)కింద కేసులు నమోదుకు వెనుకాడబోమని హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినా రేషన్‌మాఫియా లెక్కచేయడంలేదు.కేసులు కడుతున్నా, పదే పదే పట్టుబడుతున్నా.. కొందరు బరితెగించి వ్యాపారం సాగిస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీహయాంలో కాకినాడ పోర్టు ఆధారంగా పెద్దఎత్తున రేషన్‌బియ్యం అక్రమంగా తరలిపోయింది. కాకినాడ వైసీపీ కీలక నేత కుటుంబం అండ దండలతో బియ్యం అక్రమ సరఫరాదారులు చెలరేగిపోయారు. రేషన్‌బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని రీసైక్లింగ్ చేసి సన్నబియ్యంలా మార్చి ఆఫ్రికన్ వంటి ఇతర దేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకునేవారు.కాకినాడ, పిఠాపురం,పెద్దాపురం ఇలా పలుచోట్ల అక్రమవ్యాపారులు తమ స్థావరాలు ఏర్పాటు చేసుకుని బియ్యాన్ని సేకరించి నిల్వచేసేవారు. ప్రభుత్వం కిలో రూ.40కి కొని పేదలకు ఉచితంగా ఇస్తుంటే.. రేషన్‌మాఫియా కిలో రూ.10-రూ.15 ఇచ్చి కొనుగోలు చేసేది.

జిల్లాలో ఆగని రేషన్ మాఫియా

సన్నబియ్యం సరఫరా చేస్తే..

ప్రస్తుతం రేషన్‌దుకాణాల ద్వారా అందజేస్తున్న బియ్యాన్ని లబ్ధిదారులు ఎవరూ తినడం లేదు. అదే ఈ బియ్యం అక్రమ రవాణాదారులకు ఆదాయంగా మారింది. రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం అందజేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. తొలుత స్కూళ్లల్లో మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీకేంద్రాలకు సన్నబియ్యం అందజేస్తామని చెప్పి.. ఆ దిశగా చర్యలు చేపడుతోంది. చెప్పినట్టుగానే సరఫరా చేస్తోంది. రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తే.. ఎవరూ వాటిని విక్రయించుకునే అవకాశం ఉండదు.అక్రమరవాణాకు అడ్డుకట్ట పడుతుంది.

కట్టడి చేసినా..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే కాకినాడ పోర్టులో వైసీపీ నేత కుటుంబం చేపడుతున్న బియ్యం రవాణా వ్యాపారంపై దృష్టిపెట్టింది. బియ్యం సేకరణ, నిల్వ, ఎగుమతితోపాటు ఇందులో ఎవరెవరున్నారు.. వంటి వివరాలను సేకరించింది. తర్వాత వరుసగా పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా పోర్టును పరిశీలించడం, బియ్యం ఎగుమతులపై ఆరాతీయడంతో నేషనల్ మీడియా కూడా కాకినాడ పోర్టుపైనే దృష్టిపెట్టింది. బియ్యం రవాణాకు అడ్డుకట్ట పడాల్సిందేనని వారు చెప్పడంతో కలెక్టర్, ఎస్పీ, సివిల్ సప్లయీస్, పోర్టు అధికారులు చెక్‌పోస్టులు ఏర్పాటుచేశారు. అక్కడ లారీలను పూర్తిగా పరిశీలించాకే పోర్టులోకి ఎగుమతికి అనుమతించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

ఎంత తీవ్రంగా హెచ్చరించినా..

డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల, ఇతర ప్రభుత్వ పెద్దలు బియ్యం అక్రమ రవాణాను సహించబోమని, క్రిమినల్ కేసులు, పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించినా.. రేషన్‌బియ్యం పట్టుబడి వాహనాలు సీజ్‌చేస్తున్నా.. కేసులు నమోదు చేస్తున్నా మాఫియాకు అడ్డుకట్టపడడంలేదు. వైసీపీ హయాంలో రైస్ మాఫియాను నడిపించిన వారే కూటమి ప్రభుత్వంలోను నడిపిస్తున్నారని పట్టుబడిన నిర్వాహకులను బట్టి తెలుస్తోంది.

రూటు మార్చిన మాఫియా..

కాకినాడ యాంకరేజ్ పోర్టులో బొంబాయి కాటావద్ద, శక్తి గేట్‌వద్ద రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం, వైజాగ్ పోర్టులో కూడా కాకినాడ తరహా చెక్‌పోస్టుల ఏర్పాటుకు అక్కడ పౌరసరఫరాలశాఖ ఏర్పాటుకు సిద్ధం కావడంతో రేషన్‌మాఫియా రూటు మారుస్తున్నట్టు తెలుస్తోంది. ఒడిశా, గుజరాత్ పోర్టుల నుంచి బియ్యం ఎగుమతులు చేసేందుకు వారు దారులు వెతుక్కుంటున్నారని సమాచారం.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

జిల్లాలోని 21 మండలాలకు సివిల్‌సప్లయీస్ డిప్యూటీతహసీల్దార్లు 11మంది మాత్రమే ఉన్నారు. వీరే పక్క మండలాల విధులు నిర్వర్తిస్తున్నారు. రేషన్‌పంపిణీ విధానాన్ని ప్రతినెలా వీరే పరిశీలించాలి. ఉన్నసిబ్బంది ఆ విధులు చేపట్టడం కష్టమవుతుండడంతో రేషన్‌మాఫియాను పూర్తిగా అడ్డుకోలేని పరిస్థితి. 2024, డిసెంబర్ నుంచి ఈఏడాది ఇప్పటివరకు.. 47,148 టన్నుల బియ్యంనిల్వలను అధికారులు పట్టుకున్నారు. వాటివిలువ రూ.220కోట్లు, జిల్లాలో ఇప్పటివరకు 85కేసులు నమోదుకాగా, కాకినాడ సిటీ, రూరల్, పోర్టుల్లోనే 21 కేసులుండడం విశేషం.

6ఏ కేసులతో భయం లేక..

రేషన్‌బియ్యం అక్రమ రవాణాలో పట్టుబడిన వారిపై సివిల్‌సప్లయీస్ అధికారులు నమోదు చేస్తున్న కేసులు పెద్దగా ఫలితాన్నివ్వడం లేదు. అదే అక్రమార్కులకు అలుసుగా మారింది. నిజానికి 6ఏ కేసు అంత తీవ్రమైనది కాదని, జిల్లా జేసీ కోర్టులో జరిమానా విధించి, పట్టుబడిన వాహనాన్ని విడిపించుకుని వచ్చేయవచ్చని ఆ శాఖ అధికారులే చెప్తున్నారు.

రేషన్‌కార్డుల సమస్యల పరిష్కారానికి..
కలెక్టరేట్‌లో ప్రత్యేక విభాగం

- పీజీఆర్‌ఎస్ నిర్వహించిన డీసీఎస్‌వో

కలెక్టరేట్(కాకినాడ), జూలై 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ నిర్వహించిన వివేకానందహాలులో రేషన్‌కార్డు సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక విభాగాన్ని జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజు నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రేషన్‌కార్డు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. రేషన్‌కార్డులో మార్పులు,చేర్పులతోపాటు కొత్తకార్డులకోసం అర్జీలను స్వీకరించారు. అప్పటికప్పుడు వచ్చిన అర్జీల సమస్యలను సచివాలయం అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలుతీసుకున్నారు. రేషన్‌కార్డుల విషయంలో ఏ సమస్యలున్నా తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

జగన్‌ను మరోసారి సీఎం చేసేందుకు ఏకతాటిపైకి రావాలి

- వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు

కార్పొరేషన్(కాకినాడ),జూలై28(ఆంధ్రజ్యోతి): జగన్‌ను మరోసారి సీఎం చేసేందుకు దళితులంతా ఏకతాటిపైకి వచ్చి కూటమి ప్రభుత్వం మెడలు వంచాలని వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. కాకినాడ సూర్యకళామందిరంలో వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ విస్తృతస్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లాఅధ్యక్షుడు దాడిశెట్టి రాజా, జడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, మాజీఎంపీ వంగాగీత, మాజీ ఎమ్మెల్యేలు ప్రసంగించారు. ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ కేంద్రాలపై నిరంతర పర్యవేక్షణ: డీఎంహెచ్‌వో

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పిఠాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోఉన్న ఐవీఎఫ్ కేంద్రాలపై నిరంతరం పర్యవేక్షణ, నిఘాఉంచుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో ఐవీఎఫ్, సంతాన సాఫల్య కేంద్రాలు, ఫెర్టిలిటీ సెంటర్ల పనితీరు, అందులో వ్యవహారాలు, నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలను వివరిస్తూ ఆంధ్రజ్యోతిలో సోమవారం అమ్మ..బడును శీర్షికతో ప్రచురితమైన వార్త కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. ప్రభుత్వ నిబంధనలు,ప్రమాణాలకు విరుద్ధంగా ఏమైనా కేంద్రాలు పనిచేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాకినాడలో 5ఐవీఎఫ్ సెంటర్లు మాత్రమే ప్రభుత్వఅనుమతితో ఉన్నాయన్నారు. ఈ కేంద్రాల పనితీరుపై ఫిర్యాదులు ఉన్నా లిఖితపూర్వకంగా లేదా టోల్ ఫ్రీ నెంబరు 1800-425-3365 లేదా వాట్సాప్‌నెంబరు 9494113365కు ఫిర్యాదు చేయవచ్చునని చెప్పారు.

రెండు రోజుల్లో భవనాన్ని అప్పగిస్తాం

- భోగాపురం గ్రామ సర్పంచ్, కార్యదర్శి
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

పిఠాపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం భోగాపురంలోని ఆరోగ్య ఉపకేంద్రం భవనానికి పైప్‌లైన్లు వేసి తాగునీరు, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించి రెండురోజుల్లో వైద్యఆరోగ్యశాఖకు అప్పగిస్తామని సర్పంచ్ నేపాలి వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర తెలిపారు. ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని ప్రారంభించి 18నెలలు గడిచినా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించారు. భవనం అప్పగించకపోవడానికిగల కారణాలపై ఆరాతీశారు. సర్పంచ్,పంచాయతీకార్యదర్శి గోనె సంచులను దగ్గరుండి ఖాళీ చేయించారు. రెండు రోజుల్లోగా విద్యుత్ కనెక్షన్లు పూర్తి చేసి వారికి అప్పగించడంతోపాటు ఇక్కడే హెల్త్ సెంటర్ పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.



పర్యావరణహితమైన నానో ఎరువులు మార్కెట్లోకి వచ్చి చేరాయి. వీటిని వినియోగించడం వల్ల రైతులకు ముందుగా బరువు భారం తగ్గుతుంది. బస్తా ధరతో పోలిస్తే రేటు కూడా బహు తక్కువే. మారుతున్న కాలానికి అనుగుణంగా నానో ఎరువుల వినియోగాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. నానో ఎరువుల డబ్బాలను రైతులు జేబులో పెట్టుకుని సులువుగా మోసుకుని పంట పొలాలకు వెళ్లవచ్చు.





నానో ఎరువులు

మార్కెట్‌లోకి వచ్చేశాయోచ్!

పర్యావరణ హితం.. ఖర్చు తక్కువ

తగ్గనున్న బరువు భారం

అమలాపురం రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు పలకరించడంతో కోనసీమతో పాటు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో రైతులు తొలకరి పంటలో నిమగ్నమయ్యారు. అధిక దిగుబడులు సాధించేందుకు అనేక రకాల రసాయన ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు వినియోగిస్తున్న ఎరువుల బస్తాబరువు 50 కిలోలు. మార్కెట్ నుంచి ఇంటికి అక్కడి నుంచి పొలానికి ఆ బస్తాలను మోసుకువెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల బస్తాలను తరలించుకునేందుకు కూలీలకు, వాహన ఖర్చులకు అదనపు ఆర్థిక భారం మోయాల్సి వస్తోంది. బస్తాలోని ఎరువులను పంట పొలాల్లో చల్లిన తర్వాత నీటి తడులు ఎక్కువైనా, నీరు అందకపోయినా ఎరువు వృథా అవుతుంది. వీటితో ఆ పరిస్థితి మాత్రం ఉండదు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నానో ఎరువుల వినియోగంపై ప్రధానంగా దృష్టి సారించింది. రైతులు నానో ఎరువులు వినియోగించేలా చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలోని పలు వ్యవసాయ సహకార ప్రాథమిక సంఘాలకు నానో యూరియా, నానో డీఏపీలను రైతులకు అందుబాటులో ఉంచారు. అవగాహన లోపంతో రైతులు ఇంకా యూరియా బస్తాలనే భారంగా మోసుకు వెళ్తున్నారు. పక్క రైతులు ఎవరైనా నానో ఎరువులు వాడిన తర్వాత వినియోగిద్దాం అన్న భావన ఇంకా ఉంది. నానో ఎరువులు వినియోగించడం వల్ల కలిగే లాభాలను అవగాహన సదస్సుల ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివరిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

ప్రవీణ్, వ్యవసాయాధికారి, అమలాపురం



నానో ఎరువులను వినియోగించడం వల్ల నేలకు ఏ విధమైన నష్టం జరగదు. పర్యావరణానికి నష్టం వాటిల్లదు. వీటిని స్ప్రేయర్ల ద్వారా, డ్రోన్ల ద్వారా సులువుగా పంటపై పిచికారీ చేసుకోవచ్చు. తద్వారా మొక్కకు నేరుగా 46 శాతం నత్రజని అందుతుంది. రైతులకు ఆర్థిక భారంతో పాటు శారీరక శ్రమ తగ్గుతుంది. రైతులకు అందుబాటులో ఉండేలా మండల పరిధిలోని వన్నెచింతలపూడి, రంగాపురం పీఏసీఎస్‌లలో నానో ఎరువులను అందుబాటులో ఉంచాం. యూరియా బస్తా ధర రూ.1457.29 కాగా కేంద్ర ప్రభుత్వం బస్తా ఒక్కింటికీ రూ.1190.79 సబ్సిడీగా ఇస్తుంది. తద్వారా రూ.266.50కే అందుతుందని చాలా మంది రైతులకు తెలియదు.

ధరలు కూడా తక్కువే...

మార్కెట్‌లో 50 కిలోల యూరియా బస్తా ధర రూ.266 ఉంది. డీఏపీ బస్తా ధర రూ.1,350. వీటిని పొలాల వద్దకు మోసుకు వెళ్లేందుకు రైతులకు అదనంగా ఖర్చవుతుంది. అదే నానో డీఏపీ 500 మిల్లీ లీటర్ల ధర కేవలం రూ.625 మాత్రమే. నానో యూరియా 500 మిల్లీ లీటర్ల ధర రూ.265. వీటిని సులువుగా పొలాలకు తీసుకువెళ్లి పిచికారీ చేసుకోవచ్చు.



ఆటపాటలతో అభ్యాసం

బాల్యానికి భరోసా ఇచ్చేలా, చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు

అంగన్వాడీ కేంద్రాలకు ప్రత్యేక పుస్తకాల సరఫరా

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బాల్యానికి భరోసా ఇవ్వడంతో పాటు వారు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదిగేలా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. జాతీయ విద్యా విధానం, జాతీయ పాఠ్య ప్రణాళికల్లో భాగంగా మహిళా- శిశు సంక్షేమ శాఖ, పాఠశాల విద్యా శాఖ సంయుక్తంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నవచేతన, ఆధార్ శిల అనే రెండు పుస్తకాలను రూపొందించి అంగన్వాడీ కేంద్రాలకు పంపింది. వీటిలోని అంశాలను ఆయా కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు అమలు చేయడంతో పాటు చిన్నారుల తల్లిదండ్రులకు వివరించాల్సి ఉంది.


శిక్షణ ఇచ్చి పర్యవేక్షిస్తున్నాం

ప్రభుత్వం పంపిణీ చేసిన ఈ రెండు పుస్తకాలను అంగన్వాడీ కార్యకర్తలకు అందించాము. వీటిలోని అంశాలపై కార్యకర్తలకు, సహాయకులకు శిక్షణ ఇచ్చాము. కేంద్రాల్లో రోజువారీ కార్యక్రమాల అమలు తీరును పర్యవేక్షిస్తున్నాం.

జి.ఉష, సీడీపీవో
ఐసీడీఎస్ ప్రాజెక్టు, సామర్లకోట



నవచేతన పుస్తకంలో పిల్లల ఎదుగుదల, అభివృద్ధి, పోషణ, ఆరోగ్యంలతో పాటు విద్యాపరమైన అంశాలను పొందుపరిచారు. పసిబిడ్డల పెంపకంలో తల్లి, కుటుంబ సభ్యులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వారితో ఎలా ప్రవర్తించాలి, చిట్టి బుర్రలకు అర్థమయ్యేలా కబుర్లు, కథలు ఎలా చెప్పాలి అనే విషయాలను ఫొటోలతో సహా ఈ పుస్తకంలో పొందుపరిచారు. చిన్నారికి మూడేళ్ల వయసు వచ్చే వరకు ఏం చేస్తే వారు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యకరంగా పెరుగుతారో కూడా వివరించారు. పిల్లలకు ఏ నెలలో ఎలాంటి అంశాలు నేర్పించాలో విశదీకరించారు. ఇందులోని అంశాలపై అంగన్వాడీ టీచర్ తమ వద్దకు వచ్చే బాలింతలకు అవగాహన కల్పించాలి.



ఆధార్ శిల పుస్తకంలో పిల్లల సమగ్రాభివృద్ధికి అవసరమైన అంశాలను ఆటల ద్వారా అభ్యాసం చేయించడం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించేలా అంశాలను రూపొందించారు. అంతేగాక అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే మూడు నుంచి ఆరేళ్ల వయసు పిల్లలకు వినోదాత్మకంగా పాఠాలు ఎలా బోధించాలో కూడా వివరించారు. పాఠాలు చెప్పే విధానం మొత్తం ఆటలు ఆడించే ప్రక్రియగా ఉంటుంది.

నన్నయ్య వర్శిటీ భవనాలకు కొత్త పేర్లు



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ముఖద్వారం

- నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని భవనాల పేర్లు మార్పు
- కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలోని భవనాలకూ నూతన నామాలు
- సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ రంగాల్లో ప్రముఖుల పేర్లు పెట్టేలా ఏర్పాట్లు

దివాన్‌చెరువు, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గోదావరి జిల్లాల విద్యార్థుల ఉన్నత విద్య అవసరాలను తీర్చడానికి స్థాపించబడిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇక్కడి ప్రాంగణంతో బాటు కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలోని పలు భవనాలకు నూతన నామకరణాలు చేయనున్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. సంఘసంస్కర్తలు, స్వాతంత్ర్య సమరయోధులతోబాటు వివిధ రంగాల ద్వారా సమాజానికి విశేష సేవలందించిన కొంతమంది ప్రముఖుల పేర్లను ఆయా భవనాలకు నామకరణం చేయాలని విశ్వవిద్యాలయం అధికార వర్గాలు నిర్ణయించుకున్నట్టు సమాచారం. నన్నయ విశ్వవిద్యాలయం స్థానిక ప్రాంగణంలోని కేంద్ర పరిపాలనా భవనానికి సంకల్ప సదన్ అని, ఎమినిటీస్ సెంటర్‌కు సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం, ఇంటర్నేషనల్ వసతిగృహానికి ప్రఖ్యాత ఉద్యమకారుడు భగత్‌సింగ్ సదన్‌గా నామకరణం చేయనున్నారు. అలాగే ఉపకులపతి బంగ్లాకు శ్వేతసౌధగానూ బాలికల వసతిగృహానికి ప్రాణహితగానూ, బాలికల వసతిగృహం మరో భవనానికి కల్పనాచావ్లా పేరును, బాలుర వసతిగృహానికి వశిష్ట వసతి గృహంగానూ, బాలుర వసతిగృహం-2కు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం పేరు పెట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. సైన్స్ భవనానికి ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ పేరును, ఇంజనీరింగ్ వర్క్‌షాప్‌లకు కాటన్‌దొరగా గోదావరి ప్రజలు అభిమానించే ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ పేరును, ఇంజనీరింగ్ కళాశాల భవనానికి భారతదేశపు ప్రఖ్యాత ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పేరును, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ భవనానికి రతన్‌టాటా పేరును, మల్టీపర్పస్ సెంటర్‌కు సధర్మసదన్‌గా పేర్లు పెట్టనున్నారు. ఇక నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ ప్రాంగణంలోని గ్రంథాలయానికి నారాయణభట్టు విహార్‌గాను, రెండు బాలికల వసతిగృహాలకు జయసంహిత, వసుంధరగా నామకరణం చేయనున్నారు. అలాగే తాడేపల్లిగూడెంలోని నన్నయ ప్రాంగణంలోని బాలికల వసతిగృహానికి నిత్యాన్నదాత్రి డొక్కా సీతమ్మ పేరును నామకరణం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ విషయాలను విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ వద్ద ఆంధ్రజ్యోతి ప్రస్తావించగా ఈ విధంగా త్వరలో నామకరణాలు చేయనున్నట్టు ధ్రువీకరించారు.

నేటి నుంచి పెద్దాపురం నవోదయలో ఆటల పండుగ

పెద్దాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఆటల పండుగ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళం

అయినవిల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన కొమ్మిశెట్టి లోవ మాధవి కుటుంబ సమేతంగా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని సోమవారం దర్శించుకున్నారు. విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళంగా సమర్పించారు. మాధవి కుటుంబానికి ఆలయార్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. దాతను ఈవో అల్లు వెంకటదుర్గాభవానీ అభినందించారు.

పెరుగుతూ.. తగ్గుతూ

- గోదావరి వరద ప్రవాహం
- 5,85,246 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల
- ప్రస్తుతం ధవళేశ్వరం వద్ద 10.9 అడుగుల నీటిమట్టం



ధవళేశ్వరం వద్ద గోదావరి వరద ప్రవాహం

ధవళేశ్వరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ పరివాహకంలో కురిసిన వర్షాలు వల్ల వస్తున్న వరదనీటితో భద్రాచలం వద్ద తగ్గుతున్న గోదావరి మరలా పెరిగి ప్రవహిస్తుండగా ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పడుతోంది. సోమవారం ఉదయం 6లక్షల క్యూసెక్కులను కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి విడుదల చేయగా, సాయంత్రానికి 5,85,246 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదయింది. ఎగువన భద్రాచలం వద్ద ఆదివారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టిన నీటి మట్టం 34.50 అడుగులకు చేరుకోగా లక్ష్మి బ్యారేజ్ నుంచి విడుదల చేసిన వరద నీటితో రాత్రి నుంచి పెరుగుతూ సోమవారం సాయంత్రానికి 36.10 అడుగులుగా నమోదయింది. ఇది మరో నాలుగు, లేదా ఐదు పాయింట్ల మేర పెరిగి ఆపై తగ్గుముఖం పట్టవచ్చని అధికారులు అంచన. వర్షాలు తగ్గుముఖం పట్టి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. తూర్పు డెల్టాకు 3700క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2400 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6000క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



సత్యారావు మృతదేహం

ధవళేశ్వరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): గోదావరిలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక జాలరిపేటకు చెందిన సవదాల సత్యారావు (45)కు భార్య, ఇద్దరు పిల్లలు. కుటుంబ పోషణకు ఎప్పటిలాగే తోటి మత్స్యకారులతో కలిసి సోమవారం తెల్లవారుజామున కాటన్ బ్యారేజ్ వద్ద వేటకు వెళ్లాడు. సత్యారావు బ్యారేజ్ దిగువున ఉన్న పాత ఆనకట్ట స్కవర్ స్లూయిజ్ మీదుగా నడిచి వెళుతూ ప్రమాదవశాత్తూ స్కవర్ స్లూయిజ్ గేట్లు ఉండే రాతి కట్టడంలోకి పడిపోయాడు. ఆ ప్రాంతం ఇరుకుగా ఉండి వరద నీటితో నిండి ఉండడంతో పైకి రాలేక ప్రాణాలు కోల్పోయాడు. అక్కడే ఉన్న మత్స్యకారులు గమనించి రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. మత్స్యకారుల సమాచారంతో పోలీసులు, బంధువులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ మేరకు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ధవళేశ్వరం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గోదావరిలో చేపల వేటతో జీవనం సాగించే సత్యారావు అదే గోదావరికి బలైపోయాడని తమ కుటుంబానికి దిక్కెవరంటూ భార్య దుర్గ కన్నీరుమున్నీరైంది. ఈ ఘటనతో జాలరిపేట విషాదంలో మునిగిపోయింది.

రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రే వర్గీకరణ

ఆర్‌పీసీసీఎస్ జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 28(ఆంధ్రజ్యోతి): దళితులను శాశ్వతంగా రాజ్యాధికారం చేపట్టకుండా దూరం చేసేందుకు ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర జరుగుతోందని ఆర్‌పీసీసీఎస్ జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ అన్నారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులంతా కలసి ఉంటే రాజ్యాధికారం వైపు చూసే అవకాశం ఉంటుందని ఎస్సీ వర్గీకరణ పేరుతో ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు. దీనికి అన్ని పార్టీలు మద్దతు పలుకుతున్నాయన్నారు. దేశ చరిత్రలోనే ఇంత కుట్ర జరగలేదన్నారు. ముఖ్యంగా మాదిగల ఐక్యతపై దాడి జరుగుతోందన్నారు. ఎస్సీ జాబితాలో 1108 కులాలు ఉన్నాయని, దేశంలో ఎస్సీ సామాజిక వర్గంలో సొంతంగా పార్టీ పెట్టి రాజ్యాధికారం చేపట్టిన కులం చమార్(మాదిగలు)మాత్రమేనన్నారు. చమార్‌లు మిగిలిన ఎస్సీ కులాలకు సొంతంగా రాజ్యాధికారం చేపట్టాలనే ఆలోచన కల్పించారన్నారు. చమార్‌లను దెబ్బకొట్టితే తప్ప ఉత్తర భారతదేశంలో బీజేపీ గెలిచే పరిస్థితులు లేవని చమార్‌లకు చెందిన బీఎస్పీని దెబ్బకొటేందుకు ఎస్సీ వర్గీకరణ తెరపైకి తీసుకువచ్చారన్నారు. కాన్షీరామ్, మాయావతితో పాటు చమార్‌లకు చెందిన పలువురు రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా పనిచేశారన్నారు. రిజర్వేషన్లు పేరుతో 100 మందికి నలుగురు మాత్రమే లబ్ధి పొందుతున్నారని ఈ నాలుగు సమంగా పంచుతామంటున్నారని అన్నారు. దళితులంతా గమనించాలన్నారు. తాను దేశవ్యాప్తంగా శాంతియుతంగా పోరాటం చేస్తున్నానని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని మాలలు కళ్లు తెరచి ఈ పోరాటంలో పాల్గొనాలని కోరారు.

సిలబస్ రూపకల్పనలో మార్పులు అవసరం

ఎఫ్‌డీపీలో జేఎన్టీయూకే వీసీ ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద్, అతిథులు

జేఎన్టీయూకే, జూలై 28(ఆంధ్రజ్యోతి): నూతన విద్యావిధానం ప్రకారం అధ్యాపకులు సిలబస్ రూపకల్పనలో తగిన మార్పులు చేసుకోవాలని, విద్యానాణ్యతను మెరుగుపర్చే దిశగా పరిశ్రమల అనుసంధానాన్ని పెంపొందించాలని వర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ సూచించారు. కాకినాడ జేఎన్టీయూ, వరంగల్‌లోని ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ సంయుక్తంగా మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఈఐటీవై) భారత ప్రభుత్వ సహకారంతో లెవరేజింగ్ ఓబీఈ ఫర్ కంటిన్యూస్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ఇన్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్, అతిథులు ప్రారంభించిన అనంతరం అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను వీసీ వివరించారు. ఎఫ్‌డీపీ కోఆర్డినేటర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధన, ప్రాజెక్టు ఆధారిత బోధనపై దృష్టిపెట్టాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, ఐసీటీ అకాడమీ చీఫ్ ఇన్వెస్టిగేటర్ పి.రాధాకృష్ణ ఆన్‌లైన్‌లో అధ్యాపకులనుద్దేశించి మాట్లాడగా ఈసీఈ విభాగాధిపతి, ఎఫ్‌డీపీ సమన్వయకర్త డాక్టర్ బి.లీలాకుమారి ఆధ్వర్యంలో నిర్వహించగా రిసోర్సుపర్సన్లుగా శరత్‌బాబు, వేణుగోపాల్, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, డైరెక్టర్లు బాలాజీ, కృష్ణప్రసాద్, రవీంద్ర, 135 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీమూల భావనారాయణుడికి వెండి మకర తోరణం



సర్పవరం జంక్షన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామికి విశాఖ ఎస్ఆర్ పురానికి చెందిన వెంకటాచార్య వైదిక సంస్థానం నిర్వాహకుడు సాతులూరి గోపాలకృష్ణమాచార్యులు రూ.12 లక్షలు విలువచేసే పది కిలోల వెండి మకర తోరణం చేయించారు.సోమవారం దీనిని ఈవో తలాటం వెంకట సూర్యనారాయణ సమక్షంలో శ్రీమూల భావనారాయణ స్వామికి అందజేశారు. దాతకు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో పల్ల శ్రీరాములు, మామిడాల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.19.94 కోట్ల జరిమానాలు

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ప్రశ్నకు కేంద్రం సమాధానం

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిబంధనలు ఉల్లంఘించినందుకు దేశవ్యాప్తంగా 30 ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలకు మూడు సంవత్సరాల్లో రూ.19.94 కోట్లు జరిమానా విధించినట్టు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. సీఎస్ఆర్ అమలు, నిబంధనలపై సోమవారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చింది. ఏపీలో వివిధ కంపెనీల నుంచి సీఎస్ఆర్ నిధుల వ్యయం గణనీయంగా పెరిగినట్టు తెలిపిందన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.663.50 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.986.77 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,129.75 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. అర్హత కలిగిన సంస్థలు తమ సగటు లాభాల్లో కనీసం రెండు శాతం సామాజిక కార్యక్రమాలకు కేటాయించాలని, అలా ఖర్చు చేయని నిధులను ప్రభుత్వం నిర్దేశించిన ఖాతాల్లోకి మళ్లించాలని మంత్రిత్వ శాఖ సూచించిందని ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ పేర్కొన్నారు.

సామర్లకోట మునిసిపాలిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా సునేత్రాదేవి

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా వైస్ చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవిని నియమిస్తూ సోమవారం రాత్రి డీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. నాలుగేళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన వైసీపీకి చెందిన జి.అరుణపై అదే పార్టీకి చెందిన 26 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించిన విషయం విదితమే. తదుపరి పరిణామాల్లో అరుణ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయడం, కేవలం మూడు రోజుల్లోనే ఉపసంహరించుకోవడం వంటి పరిణామాలు జరిగాయి. దీంతో మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగట్లేదు. తాను విదేశీ పర్యటనకు వెళ్తున్నానని, రెండు నెలలు వరకు కౌన్సిల్‌కు హాజరు కాలేనని అరుణ మున్సిపల్ కమిషనరుకు లేఖ రాసినట్టు తెలిసింది. దీంతో ఆమె విదేశాల నుంచి తిరిగి వచ్చే వరకు కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాల నిర్వహణకు పరిపాలనాపరంగా అడ్డంకులు ఉండకుండా ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా సునేత్రాదేవిని నియమించారు. దీనిపై కమిషనరు శ్రీవిద్యను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని చెప్పారు.



ఎల్‌హెచ్‌ఎంఎస్ పరికరం

ఎల్‌హెచ్‌ఎంఎస్.. చోరీలకు నో ఛాన్స్!

- తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు
- లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టంతో అదుపు
- సీసీ కెమెరాలతో పట్టుకునే అవకాశం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



కాకినాడ క్రైం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఇటీవల దొంగతనాలు పెరిగిపోయాయి. ముఖ్యంగా తాళం వేసి ఉన్న ఇళ్లు గుల్ల అయిపోతున్నాయి. ఈ తరహాలోనే ద్విచక్ర వాహనాల దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఇంటి దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడే ముఠాలను కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో కాకినాడ ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో, క్రైం సీఐ వి.కృష్ణ సిబ్బందితో కలిసి పట్టుకుని అధిక మొత్తంలో బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇళ్లలో చోరీల కు పాల్పడే దొంగలను పోలీసులు పట్టుకున్న సంఘటనలు జరిగాయి. పోలీస్ శాఖ అత్యాధునిక సాంకేతికత ఉపయోగించి నేరాలను చేధించి నిందితులను పట్టుకుంటున్నారు. అయితే ముందస్తు జాగ్రత్త చర్యలు పాటిస్తే నేరాలను కట్టడి చేయవచ్చని స్పష్టం చేస్తున్నారు. లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)పై అవగాహన కల్పిస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ ఉపయోగం ఏంటి?

దూర ప్రాంతాలకు ఎక్కువ రోజులు ఉండే విధంగా ఇళ్లకు తాళం వేసి వెళ్లే సమయంలో ఆయా ప్రాంతాల వాసులు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం తెలియపరిస్తే ఆ ఇంటికి పోలీసులు ఉచితంగా లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) కెమెరాలను అమర్చుతారు. తద్వారా విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదు, డాక్యుమెంట్‌లు దొంగల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఎల్‌హెచ్ ఎంఎస్ కెమెరాలు అమర్చడం ద్వారా తాళం వేసిన ఇంటిలో దొంగలు పడితే ఆ సమాచారం సంబంధిత పోలీస్ అధికారికి, పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, అలాగే ఆ ఇంటి యజమానికి అలారం సిస్టం ద్వారా తెలుస్తోంది. దీంతో వెంటనే దొంగలను సులువుగా పట్టుకోవచ్చు. అలాగే ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటి బయట గేటుకు గాని, మెయిన్ డోర్‌కుగాని వేసే తాళం కప్పలు కనబడకుండా జాగ్రత్త పడాలి. ఇంటి బయట గేటులకు తాళం కనిపించే విధంగా వేస్తే యజమానులు ఇంటిలో లేరని గ్రహించి దొంగతనానికి సిద్ధపడే అవకాశం ఉంది. ఇంటి బయట రాత్రి సమయాల్లో లైటు వెలిగేలా చూసుకోవాలి. ముఖ్యంగా ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భద్రత పెరగడంతో పాటు నేరాలు జరగకుండా అరికట్టవచ్చు.

ముందస్తు చర్యలు పాటించాలి



కొంతమంది యువకులు వ్యసనాలకు బానిస లై సులువుగా కష్టపడకుండా జల్సాలు చేసుకునే క్రమంలో ఇళ్లలో చోరీలు, నడిచి వెళ్తున్న మహిళలు, వృద్ధుల మెడలోని బంగారు ఆభరణాలు తస్కరించి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాలు, పోలీస్‌శాఖలో వచ్చిన అత్యాధునిక సాంకేతికత ద్వారా కేసులను త్వరితగతిన చేధించగలుగుతున్నాం. ప్రజలు ముందస్తు జాగ్రత్త చర్యలు పాటిస్తే నేరాలను అదుపు చేయ వచ్చు.

వి.కృష్ణ, క్రైం సీఐ, కాకినాడ

ఆర్మీ నియామక ర్యాలీ, జాతీయ హాకీ టోర్నమెంట్‌కు

పటిష్ట ఏర్పాట్లు : జేసీ



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న జేసీ రాహుల్ మీనా

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ క్రీడా మైదానం వేదికగా ఆగస్టు 3 నుంచి 20 వరకు ఆర్మీ నియామక ర్యాలీ, 1 నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్ షిప్ పోటీల ఏర్పాట్లను సోమవారం కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా పరిశీలించారు. రెవెన్యూ, ఆర్మీ, కాకినాడ నగరపాలక సంస్థ, క్రీడా అభివృద్ధి హాకీ ఆంధ్రప్రదేశ్ అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కాకినాడ జిల్లా అధికార యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఈ రెండు కార్యక్రమాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగు నీరు, మరుగుదొడ్ల పారిశుధ్యం, క్రీడాకారులు వసతి, భోజనం ఇతర సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలన్నారు. ఈ నెల 30 నాటికి ఏర్పాట్లు పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జేసీ వెంట డీఆర్వో వెంకటరావు, ఆర్డీవో ఎస్.మల్లిబాబు, కాకినాడ నగరపాలక సంస్థ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, సమాచార, పౌర సంబంధాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ సీహెచ్.బాబూరావు, ఆర్మీ అధికారులు, హాకీ ఆంధ్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తులకు వసతిగదుల్లో అసౌకర్యం కలగకుండా చూడాలి



సత్రం గదులను ఇంజనీరింగ్ అధికారులతో పరిశీలిస్తున్న చైర్మన్

అన్నవరం దేవస్థానం చైర్మన్ రోహిత్

అన్నవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసే భక్తులకు వసతిగదుల్లో అసౌకర్యం కలగకుండా చూడాలని చైర్మన్ రోహిత్ ఆదేశించారు. సోమవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం ఇంజనీరింగ్, సీఆర్వో విభాగ అధికారులతో కలిసి మరమ్మతులు చేపడుతున్న న్యూ, పాత సెంటినరీ కాటేజీలను పరిశీలించారు. సుమారు 40 గదుల వరకు మరమ్మతులతో ఉండడండంతో శ్రావణ మాసం, పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రతి కాటేజీ నందు పరిశుభ్రత పాటించి మంచాలపై కొత్త పరుపులు, దిండ్లు, దుప్పట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ, సీఆర్వో సూపరింటెండెంట్ నరేష్, పెన్నాడ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన దత్తహోమం

లోక కల్యాణార్థం ఈనెల 25 నుంచి అన్నవరం కొండదిగువన కిర్లంపూడి సత్రంలో జరుగుతున్న 8వ కోటి దత్తహోమం శనివారం పూర్ణాహుతితో ముగిసింది. పలువురు రిటైర్డ్ ఉద్యోగులు అవధూత దత్తపీఠాధిపతి ఆశీసుస్సులతో విశ్వశాంతి కోసం పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. వేదమంత్రాల నడుమ హోమ పూర్ణాహుతి గావించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి సోమవారం తాడేపల్లిగూడెంకు చెందిన మాడేపల్లి నాగరాజు, కృష్ణవేణి దంపతులు రూ.1,01,116లు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా ఆయన అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



పీఆర్వోకు విరాళం అందజేస్తున్న దాత



లోవ దేవస్థానంలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

'లోవ' ఆదాయం రూ.67.57 లక్షలు

తునిరూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో హుండీల ఆదాయం గణనీయంగా పెరిగింది. ఆషాఢ మాసోత్సవాల్లో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. ఆలయ ఉన్నతాధికారుల సమక్షంలో చేపట్టిన లెక్కింపులో 33 రోజులకు రూ.67,57,459 ఆదాయం సమకూరినట్లు ఈవో విశ్వనాధరాజు తెలిపారు. గతేడాది కంటే ఈసారి రూ.26.62 లక్షలు అధికంగా సమకూరిందన్నారు. భక్తుల అవసరాలకనుగుణంగా ఆలయంలో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

నల్లజర్ల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన ఘటన తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల శివారు ఏకేఆర్‌జీ కళాశాల సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన సింగలూరి శ్రీనివాస్ ద్విచక్రవాహనంపై నల్లజర్ల వస్తుండగా ఏకేఆర్‌జీ సమీపంలో ఉన్న మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. కాలు విరిగి అపస్మారకస్థితికి చేరిన శ్రీనివాస్‌ను స్థానికులు సమీపంలో విమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం తాడేపల్లిగూడెం తరలించారు. ప్రమాదానికి కారణం అయిన లారీని పోలీస్‌స్టేషన్ తరలించామని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు.

దుస్తుల దుకాణంలో చోరీ

రావులపాలెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో జాతీయ రహదారి చెంతనే ఉన్న మారుతీ రెడీమేడ్ దుస్తుల దుకాణంలో చోరీ జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. వెదిరేశ్వరం శివారు రాళ్లగంటికి చెందిన పబ్లిసిటీ సుబ్బారావు స్థానిక జాతీయ రహదారి చెంతనే దుస్తుల రెడీమేడ్ షాపు నిర్వహిస్తున్నాడు. రోజూ ఉదయం వచ్చి రాత్రి వరకూ వ్యాపారం సాగించి తిరిగి ఇంటికి వెళ్లిపోతుంటాడు. ఇదే క్రమంలో ఈనెల 26న రాత్రి వ్యాపారం ముగించి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. 27న వచ్చిచూసే సరికి దుకాణం వెనుక తలుపులు తెరిచి ఉండడంతో లోపలలోకి వెళ్లి చూశాడు. కౌంటర్లో ఉండవల్సిన రూ.40వేల నగదు, 18 గ్రాముల బంగారు గొలుసు చోరీ అయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు సోమవారం తెలిపారు.

మాధవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల టీచర్‌కు పీహెచ్‌డీ

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు కె.రాధాకృష్ణవేణి అప్లయిడ్ సైకాలజీలో పీహెచ్‌డీ పట్టా అందుకుంది. ఈ సందర్భంగా ఎంఈవోలు శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య ఆధ్వర్యంలో సోమవారం పాఠశాల ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ డీవైఈవో నాయుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాధాకృష్ణవేణి కృషి, పట్టుదలతోనే పీహెచ్‌డీ సాధించిందన్నారు. ఆమెను హెచ్‌ఎం టి.మురళీకృష్ణ, సహచర ఉపాధ్యాయులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.



పీహెచ్‌డీ గ్రహీత రాధాకృష్ణవేణిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

'తల్లికి వందనం' డబ్బులు అడిగినందుకు

భర్తపై భార్య కత్తిపీటతో దాడి



దుర్గాప్రసాద్ నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

అమలాపురం టౌన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం డబ్బులు ఏం చేశావని అడిగినందుకు భర్తపై భార్య కత్తిపీటతో దాడి చేసిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలోని సావరం రోడ్డులో సోమవారం జరిగింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు విలేకర్లకు వివరించారు. సావరంలో నివాసం ఉంటున్న పెనుమాల దుర్గాప్రసాద్‌కు భార్య దుర్గ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల ఖతాల్లో తల్లికి వందనం డబ్బులు జమ చేసింది. అయితే ఆ సొమ్ములు ఏం చేశావని భర్త దుర్గాప్రసాద్ భార్య దుర్గను ప్రశ్నించాడు. దాంతో మాటామాటా పెరిగి దుర్గాప్రసాద్‌పై భార్య దుర్గ కత్తిపీటతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. భర్త దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్య దుర్గపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు.

'ఉప్పాడ శాశ్వత రక్షణకు డిప్యూటీ సీఎం చర్యలు'

కొత్తపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తరచూ సముద్ర కోతకు గురవుతున్న కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడకు శాశ్వతంగా రక్షణ కల్పించేందుకు డిప్యూటీ సీఎం పవన్ చర్యలు చేపట్టారని జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు చెప్పారు. కాకినాడ జిల్లా కొత్తపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా ఉప్పాడ కోత నివారణకు డిప్యూటీ సీఎం ఇప్పటికే కేంద్రంతో చర్చించి రూ.323 కోట్ల గ్రాంటు మంజూరు చేయించారని తెలిపారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడతామన్నారు. ఇటీవల మాయాపట్నంలో సముద్ర కెరటాలు మత్స్యకారుల గృహాల్లోకి ప్రవేశించాయనే సమాచారం పవన్ దృష్టికి వెళ్లిందన్నారు. వారికి సహాయం అందిస్తామని తెలిపారు.

పంచాయతీరాజ్‌లో పది వేల మందికి పదోన్నతులు

ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ

సామర్లకోటలో శిక్షణ తరగతులు



ప్రసంగిస్తున్న ఓఎస్‌డీ వెంకటకృష్ణ

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పదివేల మందికి పైబడి పదోన్నతులు వచ్చాయని ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లాలకు చెంది ఇటీవల ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన 46మంది నూతన ఎంపీడీవోలకు నెల రోజుల శిక్షణ తరగతులను ఓఎస్‌డీ వెంకటకృష్ణ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ కెవిస్వీ.ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తరగతుల్లో ఓఎస్‌డీ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థను మరింత ప్రజాహితం చేసేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అంకితభావంతో పనిచేస్తున్నారన్నారు. ప్రజలకు సేవలు మెరుగుపర్చడంతో పాటు ఉద్యోగులందరికీ సకాలంలో పదోన్నతులు వచ్చేలా కృషిచేస్తున్నారన్నారు. ఎంపీడీవోలుగా పదోన్నతులు పొందిన వారు సమన్వయ, పరిపాలన నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. మండలంలోని అన్ని శాఖల ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ మంచి నాయకులుగా పని చేయాలన్నారు. ప్రజల ఆకాంక్షలు మారుతున్నట్లే అధికారులు వాటిక నుగుణంగా పనిచేయాలన్నారు. నెలరోజుల శిక్షణ తర్వాత ఎంపీడీవోల పరిపాలన తీరులో మార్పులు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శిక్షణా కేంద్రాన్ని పరిశీలించి ప్రిన్సిపాల్, తదితర ఫ్యాకల్టీలకు సూచనలు చేశారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పు గోదావరి జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 43మంది ఎంపీడీవోలు తొలి బ్యాచ్‌గా శిక్షణ పొందుతున్నట్టు ప్రిన్సిపాల్ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ రమణ, డీడీవోలు శ్రీనివాసరావు, నాతి బుజ్జి, ప్రత్తిపాడు ఏపీడీ మోకా భానుప్రకాష్, ఎంపీడీవోలు ఎస్ఎస్. శర్మ, సుశీల, డి.శ్రీలలిత పాల్గొన్నారు.

మోతుగూడెంలో పోలీసుల తనిఖీలు

మోతుగూడెం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మోతుగూడెంలో సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు చేపట్టే మావోయిస్టుల అమరవీరు సంస్మరణ సభలు నేపథ్యంలో మోతుగూడెం ఎస్ఐ ఎస్‌కే సాదిక్, పోలీస్ బృందం, సీఆర్పీఎఫ్ ఏ పార్టీ టు సిబ్బంది మోతుగూడెం పోలీస్ స్టేషన్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. మోతుగూడెం, రాజమహేంద్రవరం, భద్రాచలం, విశాఖపట్నం రహదారులను ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రధాన కల్వర్టులు, రహదారులను బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. పోలీస్ చెక్ పోస్ వద్ద అనుమానితులను ప్రశ్నించారు. ట్రైనింగ్ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సోమవారం నుంచి విశాఖ నుంచి మోతుగూడెం మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీసులు రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. ఉదయం బస్సు సర్వీసులు యథావిధిగా తిరుగుతాయని వారు చెప్పారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

మా గోడు వినండి మహాప్రభో!

కాకినాడ కలెక్టరేట్‌లో దివ్యాంగుల వినతి

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'నా చేతులు, కాళ్లు చచ్చుబడి మంచానికే పరిమితమైనప్పటికీ కేవలం రూ.6వేలు పించను మాత్రమే ఇస్తున్నారు. సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ చేసి రూ.15వేలు పించను ఇవ్వాలి' అని కాకినాడ జిల్లా పిఠాపురం మండలం గోకవాడకు చెందిన అమ్మల గంటి సత్య సోమవారం కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చింది. తన కూతురు సత్య బధిరురాలు అని తెలిపింది. సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ చేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. మరికొందరు దివ్యాంగులు సమస్యలు తెలిపేందుకు కాకినాడ కలెక్టరేట్‌కు వచ్చి వినతులిచ్చారు.





జాతీయ స్థాయి ప్రదర్శనకు తొండవరం విద్యార్థి ప్రాజెక్టు

అంబాజీపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎడ్యూకేషన్ డే ఎస్ఈపీ 2025 సందర్భంగా న్యూఢిల్లీ ప్రగతి మైదానంలో ఈనెల 28 నుంచి 31 వరకూ జరగనున్న జాతీయ స్థాయి ప్రదర్శనకు కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం విద్యార్థి శ్రీరామ్ తేజ తయారు చేసిన ప్రాజెక్టును ప్రదర్శించనున్నారు. మినిస్ట్రీస్ ఆఫ్ ఎడ్యూకేషన్ ఇన్నోవేటివ్ సెల్, ఏఐసీటీఏ ద్వారా జాతీయ స్థాయికి ఏపీ తరుపున ఎంపికైన ఏకైక ప్రాజెక్టు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ పొందిన కార్బనయాక్సైడ్ ఫిల్టర్‌ను ఉపాధ్యాయుడు గణేష్ నరసింహరావు ఆధ్వర్యంలో శ్రీరామ్‌తేజ తయారు చేశాడు. ఈ ప్రాజెక్టును మంగళవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీ పాల్గొనే కార్యక్రమంలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని, ఉపాధ్యాయుడిని పాఠశాల హెచ్‌ఎం కేశవాచార్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.



ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థి శ్రీరామ్‌తేజ

పదో తరగతి విద్యార్థినికి గర్భం

కోనసీమ జిల్లాలోని ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్ నిర్వాకం

రాయవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిని కరస్పాండెంట్ లోబర్చుకుని గర్భవతిని చేసిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని ఓ గ్రామంలో వెలుగుచూసింది. బాలిక ఒక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. విద్యార్థినికి సుమారు 4 నెలలుగా నెలసరి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయించేందుకు ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు బాలిక గర్భవతి అని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కుమార్తెను గట్టిగా నిలదీయడంతో జరిగిన విషయాన్ని బాలిక వివరించినట్టు కుటుంబ సభ్యుల్లో ఒకరు తెలిపారు. సంఘటనపై బాలిక తల్లిదండ్రులు రాయవరం పోలీసులను ఆశ్రయించారు. అయితే ప్రైవేటు పాఠశాలకు 7వ తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉండగా వేరే పాఠశాలలో అడ్మిషన్ చూపించి విద్యార్థులకు టెన్త్ క్లాస్ తరగతులు చెబుతూ కరస్పాండెంట్ ఈ నిర్వాకానికి పాల్పడినట్టు సమాచారం. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. కేసు కూడా నమోదు చేస్తారని సమాచారం.

గుడ్డుపై వింత ఆకారం




కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో కోడిగుడ్డు పై భాగం వింత ఆకారంలో కనిపించింది. ఇది తల్లి కడుపులో పిండం మాదిరిగా ఉండటం ఆసక్తిగా మారింది. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న సలాది ఆదిలక్ష్మి ఇంటిలో ఉన్న కోడి సోమ వారం ఈ వింత ఆకారంలో ఉన్న గుడ్డును పెట్టింది. పై భాగం పిండం మాదిరిగా ఉండడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి)

వెంటాడి.. వేటాడి!

తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఆహారం కోసం ఓ కొంగ ఎంతో ప్రయత్నించింది. ఈలోపే ఓ జరచరం కొంగనే వేటాడుదామనుకున్నా తప్పించుకుంది. తర్వాత కొంగ చేపను పట్టుకుని ఆరగించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



విద్యార్థులకు కంటి పరీక్షలు

తాళ్లరేవు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): చొల్లంగిపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్రాధికారి కె.చంద్రశేఖర్ సోమవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈవో బొడ్డు కుమార్, హెచ్ఎస్ నిరంజన్, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి
రూ.114 కోట్లతో ప్రాజెక్టు రూపకల్పన

గొల్లప్రోలు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ ప్రజలు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.114 కోట్లతో ప్రాజెక్టు రూపకల్పన చేశామని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గొల్లప్రోలు ప్రజలకు తాగునీరు అందించేందుకు కాంట్రాక్టర్ వల్లభశెట్టి సత్యనారాయణ తన సతీమణి వెంకటరమణ జ్ఞాపకార్థం వాటర్ ట్యాంకర్ సమకూర్చారు. సోమవారం దీనిని నగర పంచాయతీకి అందజేసి మర్రెడ్డి ప్రారంభించారు. కమిషనరు నామ కనకారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల ఏసువెంకటరమణ, నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, బస్సా చిట్టిబాబు, మామిడాల దొరబాబు, పర్ల రాజా తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఫొటో లేకపోవడంపై టీడీపీ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో నాయకులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై కమిషనరును ప్రశ్నించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొనకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు.


వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభిస్తున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు

పీ4ను విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే నానాజీ

కరప, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. కరప చంద్రన్న సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, వీవోఏలతో ఏర్పాటు చేసిన పీ4 అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలో 11,193 బంగారు కుటుంబాలను అధికారులు సర్వే ద్వారా గుర్తించారన్నారు. కరప మండలంలో గుర్తించిన 3,193 మంది బంగారు కుటుంబాల ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు కనీసం 1,595 మంది మార్గదర్శులు అవసరమవుతారని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు 304 బంగారు కుటుంబాలను పలువురు మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, కటకంశెట్టి బాబి, నులుకుర్తి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, మట్టా ప్రకాష్‌గౌడ్, పబ్బినీడి వెంకటకృష్ణ, మామిడాల వెంకటేష్, రెడ్డిపల్లి నారాయణరావు, బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, వెలుగుబంట్ల సూరిబాబు, జోకా తాతాజీ, సైనవరపు భవానీశంకర్, బోగిరెడ్డి గంగాధర్, యాళ్ల పండు, ఎంఈవో కొప్పుల బులిక్ష్మవేణి, డిప్యూటీ ఎంపీడీవో సలాది శ్రీనివాసరావు, ఏవో బీఎల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.


కరపలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కలెక్టరేట్ పీజీఆర్ఎస్ వద్ద బెంచీల ఏర్పాటు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక వద్ద ఆరు బయట ప్రాంగణంలో అర్జీదారులు కూర్చోవడానికి బెంచీలు లేవని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించి స్పాన్సర్ల సాయంతో బెంచీలను ఏర్పాటు చేయించారు.

కరపలో తాగునీటి కలుషితంపై కదిలిన యంత్రాంగం

కరప, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'కరపలో తాగునీరు కలుషితం' శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వర్ధన్, పంచాయతీ కార్యదర్శి నిర్మలాదేవి స్థానిక నాయకులతో కలిసి సీపీడబ్ల్యు స్కీమ్‌కు సంబంధించిన ఫిల్టర్ యూనిట్‌ను పరిశీలించారు. వీధుల్లో పగిలిన పైపులను గుర్తించి సిబ్బందితో లీకేజీలను అరికట్టించారు. సమగ్ర రక్షిత మంచినీటి చెరువు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను సందర్శించి ఆ ప్రదేశాల్లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. వీధి కుళాయిలు, జేజేఎం పైపుల నుంచి పసర, బురదనీరు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఏఈ వర్ధన్ తెలిపారు. జనసేన నేత బోగిరెడ్డి గంగాధర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కాకినాడ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గిల్డ్ ఆఫ్ సర్వీస్ అప్పర్ ప్రైమరీ స్కూల్ 1981-87 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కాస్మోపాలిటన్ క్లబ్ సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. 45 సంవత్సరాల క్రితం నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా తాము చదువుకున్న పాఠశాలకు అవసరమైన సహకారం అందించారని నిర్ణయించారు. రోటరీ గ్రీన్‌సిటీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కందాలం రవీంద్రనాథ్, పూర్వ విద్యార్థులు ఉషాబాల, వెంకటలక్ష్మి, నాగవేణు, భాను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


45 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థుల గ్రూప్ ఫొటో

కాపు ఉద్యోగ సేవా సమితి జిల్లా తాత్కాలిక అధ్యక్షుడిగా శ్రీనివాస్

సర్పవరం జంక్షన్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కాపు ఉద్యోగ సేవా సమితి కాకినాడ జిల్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బొజ్జ శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని శుభం కాపు కల్యాణ మండపంలో కాపు ఉద్యోగ సేవా సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు రామకుర్తి దొరబాబు మాట్లాడుతూ తాను వేరొక జిల్లాకు బదిలీపై వెళ్లడంతో సంఘ కార్యకలాపాల నిర్వహణ, బలోపేతం కోసం తాత్కాలిక అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్టు తెలిపారు. కోశాధికారిగా నున్న సత్యనారాయణ ఎన్నికయ్యారు. మిగతా పాలకవర్గ సభ్యులతో కమిటీ కొనసాగుతుందన్నారు. కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ సంఘ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలను వివరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారానికి.... ప్రభుత్వానికి, సంఘ సభ్యులకు మధ్య వారధిగా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు కె.నూకరాజు, గౌరవ సలహాదారులు ఇ.వెంకటరమణ, టి.లక్ష్మీనారాయణ, టీవీఎస్ రంగారావు, శ్రీరంగనాయకులు, తుమ్మల రామలక్ష్మి, యాళ్ల పద్మజ, నందే పద్మావతి, ఆదిత్యమూర్తి, తుమ్మలపల్లి జయకృష్ణ పాల్గొన్నారు.


శ్రీనివాస్‌ను అభినందిస్తున్న సంఘ సభ్యులు



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో రూ.1.60 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంట్‌ను కలెక్టర్ షాన్‌మోహన్ సోమవారం ప్రారంభించారు. జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావు, ఉద్యోగి శివ పాల్గొన్నారు.

'ఎయిడెడ్ విద్యా సంస్థలను పరిరక్షించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ విద్యా సంస్థలను పరిరక్షిస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు మాట్లాడుతూ ఎయిడెడ్ విద్యా సంస్థలను కాపాడతామని యువగళం యాత్రలో లోకేశ్ హామీ ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎయిడెడ్ సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు పుస్తకాలు కూడా ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు తక్షణం పాఠ్య పుస్తకాలు అందించాలని, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. కాకినాడ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవ, సాహిత్, ఉపాధ్యక్షులు రాజేష్, గమ్మివేలు, భువనేశ్వరి, నాయకులు గుణశ్రీ, సత్యవతి, ప్రసన్న, కన్నా తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు వినతుల వెల్లువ

పిఠాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్వీవీ సత్యనారాయణ ప్రజల నుంచి 67 అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు తమ వినతులు, ఫిర్యాదుల నమోదు, వాటి స్థితిగతుల వివరాలను టోల్‌ఫ్రీ నెంబరు 1100కి ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ఏపీడీ వసంతమాధవి, మునిసిపల్ కమిషనరు కనకారావు, తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జగ్గయ్యచెరువు కాలనీలోని ప్లాట్ నెం. 348 నుంచి 1885 వరకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతూ అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ బాలిపల్లి రాంబాబు, కౌన్సిలర్లు కావాడ పోశయ్య, బండి రవి, మహిళలు వినతిపత్రం అందజేశారు. అధ్వాన రహదారులతో ఇక్కట్లు పడుతున్నామని వివరించారు. సామర్లకోట-పిఠాపురం మధ్య తిరిగే ఆర్టీసీ బస్సును కాంప్లెక్సు వరకు నడపాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సహ కన్వీనర్ దువ్వా మణికుమార్ కోరారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కర వ్యవస్థలో అదనపు కమిషనరు కేటీ సుధాకర్ 15 అర్జీలు స్వీకరించారు. ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు నిర్వహించిన 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమానికి ముగ్గురు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు. కార్పొరేషన్ మేనేజరు సీతారాం, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, ఎస్ఈ వెంకట్రావు, డీసీపీ కృష్ణారావు, టీపీ ఆర్వో శైలజ, ఉద్యాన శాఖ ఏడీ సిరిల్ పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 8 అర్జీలు అందినట్టు ఆర్డీవో కె.శ్రీరమణి తెలిపారు. వీటిలో భూ సంబంధిత, పెన్షన్, ఆధార్ రాంగ్ సీడింగ్ అంశాలపై పలువురు వినతులు అందించారు.

డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలి: ఆర్డీవో శ్రీరమణి

పెద్దాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు ముమ్మరంగా నిర్వహించాలని ఆర్డీవో కె.శ్రీరమణి వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై మాట్లాడారు. లింగ నిర్ధారణ చట్టం, అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

108 పాద శివలింగాలు ఆధ్యాత్మిక గ్రంథాల బహూకరణ

కాకినాడ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ యువవాహిని ఆధ్వర్యంలో నగరంలో జరిగిన వాయిద్య సమ్మేళనంలో ఉపాధ్యక్షుడు డాక్టర్ గరికపర్తి నమశ్శివాయ రచించిన 108 పాద శివలింగాలు ఆధ్యాత్మిక గ్రంథాలను సభికులకు బహూకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ కళాకారులకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమానికి యువవాహిని కన్వీనర్ డాక్టర్ తురగా సూర్యారావు సారథ్యం వహించారు. సత్కళావాహిని సంస్థ అధ్యక్షుడు ఎస్వీ గోపాలనరసరాజుకు శ్రీకృష్ణ అవార్డు, సంగీత కళాకారులకు బహుమతులు అందజేశారు. యువవాహిని కార్యదర్శి విజేంద్ర, సత్కళావాహిని ఉపాధ్యక్షురాలు గుజ్జరి కాత్యాయిని, సహ కార్యదర్శి డాక్టర్ చిక్కాల సరోజిని, సలహాదారు ఉద్గళ సుబ్బారావు, న్యాయవాది కేవీఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

బాప్టిస్టు సంఘాలు ఐక్యంగా ఉండాలి

ఏపీ క్రిస్టియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుధీర్

పిఠాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బాప్టిస్టు సంఘాలు ఐక్యంగా ఉండి సువార్త ప్రచారానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.సుధీర్ సూచించారు. అనకాపల్లి నుంచి రామచంద్రపురం బాప్టిస్టు ఫీల్డ్ వరకు గల తొమ్మిది ఫీల్డ్ కౌన్సిల్స్ సమైక్య గోదావరి అసోసియేషన్ కలయిక పిఠాపురంలోని ఆంధ్ర బాప్టిస్టు సంఘంలో గుబ్బల సాల్మన్‌రాజు అధ్యక్షతన సోమవారం జరిగింది. 130 బాప్టిస్టు సంఘాల నుంచి 300 మంది సంఘకాపరులు, నాయకులు హాజరయ్యారు. సంఘాల ఐక్యత, సువార్త పరిచర్య, బాప్టిస్టు ఆస్తుల క్రమబద్ధీకరణపై చర్చించి తీర్మానాలు చేశారు. గోదావరి బాప్టిస్టు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కడారి శామ్యూల్, డాక్టర్ జి.ఎలీషాబాబు, కోశాధికారిగా సైలస్‌పాలు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. వీరిని నార్తరన్, కృష్ణా అసోసియేషన్ నాయకులు మాథ్యూపీటర్, కె.రవిప్రకాష్, గుబ్బల సాల్మన్‌రాజు, బి.థియోఫిలాస్, కాకినాడ సెమినరీ కౌన్సిల్ చైర్మన్ జాన్ ఇమ్మానుయేల్, సీబీసీఎస్‌సీ పాస్టర్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు డి.వరప్రసాద్ అభినందించారు.


సమైక్య గోదావరి అసోసియేషన్ కలయికలో పాల్గొన్న నాయకులు, పాస్టర్లు

అభివృద్ధి పనుల ప్రారంభం

సామర్లకోట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటకృష్ణరాయపురం, బోయినపూడి గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ కుర్రా నారాయణస్వామి (రాజు), సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన గ్రామ సభకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తోటకూర శ్రీనివాసు, గుమ్మళ్ళ రామకృష్ణ, చీకట్ల వెంకటేష్, పెంకే వెంకటేష్, ముసిరెడ్డి శ్రీరాములు, ముసిరెడ్డి రాంబాబు, ఎంపీడీవో కరక హిమహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


వీకే రాయపురంలో బీటీ రోడ్డు ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజప్ప, బాబు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కొత్తపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుతుకుడుమిల్లి, యండపల్లి, నాగులాపల్లి, ఉప్పాడ గ్రామాలకు చెందిన అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.8లక్షలు మంజూరయ్యారు. సోమవారం వాటిని చెక్కుల రూపంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు. జనసేన వైద్య విభాగం ప్రతినిధి, సురక్ష మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, కాకినాడ జీజీహెచ్ డైరెక్టర్ రావు అక్షయ్, పీబీసీ డీసీ-1 చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రవణం సుబ్రహ్మణ్యం, బొజ్జా లోవరాజు, పిల్లా శివశంకర్, పెద్ద, బత్తిన శ్రీనివాస్, టీడీపీ నాయకుడు పెంకే గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


కుతుకుడుమిల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న కూటమి నాయకులు


శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీవైఈవో వెంకటేశ్వరరావు

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఉపాధ్యాయులకు స్కూల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం రెండో విడత శిక్షణ తరగతులు గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ప్రారంభమయ్యాయి. నాలుగు రోజులు జరిగే శిక్షణా తరగతులను డీవైఈవో ఎన్.వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా ఏఎంవో వి.జగన్మోహనరావు ప్రారంభించి ఉపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పెదపూడి, పిఠాపురం ఎంఈవోలు సీవీవీ సత్యనారాయణ, నారాయణదాసు, చేబ్రోలు హైస్కూలు హెచ్ఎం ప్రకాష్, ఎనిమిది మంది రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.


తాళ్లరేవు తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

'జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలి'

తాళ్లరేవు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ తహసీల్దారు కార్యాలయం ఎదుట అఖిలపక్ష నేతలు సోమవారం ధర్నా నిర్వహించారు. అఖిలపక్ష నేత టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడుతూ 216 జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగి చాలా మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. నాలుగు వరుసలుగా ఆధునికీకరించి రోడ్డు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తహసీల్దారు త్రినాథరావుకు వినతిపత్రం అందించారు. కాశి లక్ష్మణస్వామి, అత్తిలి బాబూరావు, ముదుగు శ్రీనివాసరావు, బొంతు మోహన్, పోతుల రత్నకుమారి, దోనం శ్రీనివాసరావు, వల్లు రాజబాబు, బొంతు శ్రీను, నల్లి ఈశ్వరరావు పాల్గొన్నారు.

రైస్ బ్యాగ్‌లు, చీరల పంపిణీ

కాకినాడ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఏలూరు జిల్లా గౌరవాధ్యక్షుడు గనిశెట్టి మారుతి శివరామ్‌గోపాల్ ఆధ్వర్యంలో పెద్ద మార్కెట్ ఏరియాలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద సోమవారం పేదలకు భోజన వసతి, ఐదు కిలోల రైస్ బ్యాగ్‌లు, చీరలు పంపిణీ చేశారు. కార్యకమంలో ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు బత్తుల సూర్యప్రసాద్, డాక్టర్ కాలాడి కృష్ణ, అడపా జగదీష్, మండపాక నాగబాబు, ఎంవీవీ సత్యనారాయణ, కె.వీరబాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటా సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యం'

పెద్దాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ఇంటింటా సంక్షేమం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని జి.రాగంపేటలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగులో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొయిళ్ల కృష్ణమూర్తి, నేతలు బి.వెంకటరమణ, జల్దాని సుబ్రహ్మణ్యం (బాబీ) తదితరులు పాల్గొన్నారు.


జి.రాగంపేటలో మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

ముగిసిన కంప్యూటర్ శిక్షణ

కాకినాడ సిటీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రేచర్లపేటలోని మస్జీదే అల్ ఫరాన్, నూర్ బాషా కమిటీ, ది ఫైన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహించిన కంప్యూటర్ ఉచిత శిక్షణ ముగిసింది. 100 విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. మస్జీద్ ప్రెసిడెంట్ నయీం సిద్ధిక్ అధ్యక్షత వహించగా ఖురాన్ బోధకుడు జహరుల్లా అతిథిగా విచ్చేశారు. కార్యక్రమాన్ని కమిటీ గౌరవాధ్యక్షుడు ఎండీ జమీల్ అస్గర్ పర్యవేక్షించగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం గౌరవ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

వ్యాయామ ఉపాధ్యాయుల
అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ రూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ ఉపాధ్యాయుల 2025-26 అకడమిక్ క్యాలెండర్‌ను కాకినాడ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం గౌరవ చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కాకినాడ యాక్స్ టైలర్స్ అధినేత స్పాన్సర్ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి వి.మాచరరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు యార్లగడ్డ బంగార్రాజు, కె.పట్టాభిరామ్, ఎల్.రవికుమార్ పాల్గొన్నారు.

పిఠాపురంలో అంతరిక్ష విద్యా శిబిరం

పిఠాపురం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతరిక్ష విద్యా శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రాకెట్ లాంచింగ్ విధానం, వివిధ రకాల రాకెట్లు, టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్లు వినియోగం అంశాలపై అవగాహన కల్పించారు. ఏపీ సైన్స్ సిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు, స్టేట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, ముస్కాన్ సంస్థ చీఫ్ ఆపరేషనల్ మేనేజరు ప్రసిద్ధి దీప్చాంద్, సైన్స్ సిటీ రిలేషన్ ఆఫీసర్ శివరాం, కాకినాడ డీవైఈవో వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్, పాఠశాల హెచ్ఎం యాహియా తదితరులు పాల్గొన్నారు.


రాకెట్ లాంచింగ్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పూడికతీత పనుల పరిశీలన

కరప, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకట్ట గ్రామంలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే పంతం నానాజీ పర్యటించి కైకవోలు మురుగు కాలువలోని పూడికతీత పనులను పరిశీలించారు. కైకవోలు, అరట్లకట్ట, అచ్యుతాపురం గ్రామాల్లోని సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు ముంపు నీటి సమస్య తలెత్తకుండా ఈ కాలువలోని పూడికను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నట్టు ఎమ్మెల్యే నానాజీ తెలిపారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని మురుగు, ముంపు నీటి పారుదలకు అవరోధంగా మారిన అన్ని డ్రైన్లలో ఈ పూడిక పనులు చేయిస్తున్నామన్నారు. అలాగే సాగునీరందించే పంటకాలువలకు మరమ్మతులు చేయించినట్టు చెప్పారు. కూటమి నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంటా వీరన్నచౌదరి, సతీష్, ముత్యాలరావు, మల్లేశ్వరరావు, నక్కా బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

చారుమజుందార్‌కు ఘన నివాళి

ఏలేశ్వరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినోద్ మిశ్రానగర్‌లో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు విప్లవకారుడు చారు మంజుదార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 64 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్

రంపచోడవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ పలు సమస్యలపై ప్రజల నుంచి 64 అర్జీలు అందాయన్నారు. అర్జీలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఏపీవో(జీ) డీఎన్వీ రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, డిప్యూటీ డైరెక్టర్లు రుక్మాండయ్య, షరీఫ్, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, అధికారులు పాల్గొన్నారు.

పేదరికం లేని రాష్ట్రం లక్ష్యం : పీవో

చింతూరు, జూలై 28(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అడుగు ముందుకు వేయాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ పేర్కొన్నారు. సోమవారం చింతూరులోపీ-4 కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ పీ-4కార్యక్రమం ద్వారా 2029 నాటికి అన్ని బంగారు కుటుంబాలను పేదరికం నుంచి విముక్తుల్ని చేయాలన్నారు. చింతూరు డివిజన్‌లో46 పీ-4 గ్రామసభలకు 42గ్రామ సభలను నిర్వహించామన్నారు. డివిజన్‌లో మొత్తం 9449 బంగారు కుటుంబాలను గుర్తించచామన్నారు. ఆర్థికంగా బలోపేతంగా ఉన్న ప్రతీ ఒక్కరూ ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని పీవో కోరారు.

ఆదివాసీ విద్యార్థి రిత్విక్‌ను దత్తత తీసుకున్న ఐటీడీఏ పీవో



చింతూరు, జూలై28(ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమం సోమవారం చింతూరులో నిర్వహించారు. చింతూరు మండలం నిమ్మలగూడేనికి చెందిన ఆదివాసీ పేద విద్యార్థి మడకం రిత్విక్‌ని ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ దత్తత తీసుకున్నారు.రిత్విక్ నిమ్మలగూడెం ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువు తోన్నాడు. రిత్విక్ తల్లిదండ్రులు మడకం చిన్న, విజయలక్ష్మిలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాను ఎక్కడకు బదిలీ అయినప్పటికీ రిత్విక్ భవిష్యత్‌కు బంగారు బాటవేయడం కర్తవ్యంగా భావిస్తానని పీవో అన్నారు.

క్రీడా పోటీల్లో లోయర్ సీలేరు విద్యార్థుల ప్రతిభ

మోతుగూడెం, జూలై 28(ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహించిన క్లస్టర్ స్థాయి క్రీడా పోటీల్లో మోతుగూడెం లోయర్ సీలేరు ఏపీ జెన్కో డీఏవీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపించారని ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం తెలిపారు అండర్-14 బాలికల కబడ్డీలో ద్వితీయ స్థానం, అండర్-14 బాలుర విభాగంలో వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. పీటీ భద్రం, విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం, ఎల్ఎంసీ ఛైర్మన్ వి.రాజారావు, ఉపాధ్యాయులు అభినందించారు

'పార్టీలో సీనియర్లకు గుర్తింపు ఇవ్వడం లేదు'

ఎటపాక, జూలై 28(ఆంధ్రజ్యోతి): టీడీపీలో 30ఏళ్లుగా సీనియర్ కార్యకర్తలుగా పనిచేస్తున్నాం, పార్టీ ఆదేశించిన ప్రతీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు సీనియర్లను పట్టించుకోవడంలేదని, పార్టీలో ఎలాంటి గుర్తింపు ఇవ్వడంలేదని టీడీపీ సీనియర్ నాయకుడు పూరేటి వెంకటేశ్వరరావు, టీపీవీడు సర్పంచ్ మోసం రాజు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం టీపీవీడు గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక ప్రజాప్రతినిధులై ఉండి గ్రామాల్లో డ్రైనేజీ, అంతర్గత రహదారులు, రహదారుల మరమ్మతులు తదితర సమస్యలు పరిష్కరించలేకపోతున్నామన్నారు. ప్రజలకుసమాధానం చెప్పలేక పోతున్నామన్నారు. నాయకులు పూసం రాఘవయ్య, అపకా రాంబాబు, రత్నాకర్, బాబూరావు పాల్గొన్నారు.

నేటి నుంచి రీజనల్ స్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు

ఎటపాక, జూలై 28(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించనున్నటు విద్యాలయం ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కేటీ ప్రసాద్ తెలిపారు. రీజనల్ స్థాయిలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్, లక్షద్వీపుల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. అయితే ఆదివారం నుంచి పోటీల్లో పాల్గొనేందు విద్యార్థులు ఎటపాక నవోదయ విద్యాలయానికి తరలివస్తున్నారు.

మారేడుమిల్లి సీఐగా నరేంద్రప్రసాద్



మారేడుమిల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి సీఐగా డి.గోపినరేంద్రప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. మారేడుమిల్లి, గుర్తేడు ఎస్ఐలు పి.శ్రీనివాసరావు, ఎస్.వెంకయ్య, పోలీస్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఇక్కడ సీఐగా పనిచేసిన గోపాలకృష్ణ బదిలీపై చింతూరు వెళ్లారు.


'గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించొద్దు'

మారేడుమిల్లి, జూలై 28(ఆంధ్రజ్యోతి):రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బాబూరావు నాయుడు వాల్మీకి తెగను విమర్శిస్తూ పుస్తకం రాయడంపై మండల వాల్మీకి సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. 34గిరిజన తెగలు ఉండగా కేవలం 4తెగలనే ఉద్దేశించి విమర్శిస్తూ ప్రధానంగా వాల్మీకి తెగను ఉద్దేశపూర్వకంగా విమర్శించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలను పక్కదోవపట్టించి గిరిజన తెగల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేశారన్నారు. ఆయన రచించిన ఉనికి కోల్పోతున్న ఆదివాసీలు అనే పుస్తకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వాల్మీకి సంఘం నాయకులు జి.బాలాజీ బాబు, కొండా జాకబ్, ఎల్.రవికుమార్, వాల్మీకి సంఘ మండల అధ్యక్షుడు జి.అనుదీప్‌కుమార్, మండల కమిటీ సభ్యులు దూడ సువర్ణకుమార్, జి.అనిల్‌ప్రసాద్, లక్కొండ బుజ్జి, లక్కొండ దావీదు తదితరులు పాల్గొన్నారు.

మద్యం అధిక రేట్లకు విక్రయంపై విచారణ జరపాలి

రంపచోడవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం నియోజకవర్గంలోని మద్యం షాపుల్లో అధిక రేట్ల విక్రయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ద్వారా లాటరీ పొంది గిరిజనుల పేరుతో తీసుకున్న మద్యం షాపులను గిరిజనేతరులు అక్రమంగా నడుపుతున్నారని ఆరోపించారు. ఈషాపుల్లో గిరిజనులను మభ్యపెట్టి అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్నారన్నారు. తక్షణమే మద్యం షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం షాపుల్లో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మద్యాన్ని విక్రయిస్తున్నారని, దీని వల్ల ప్రభుత్వ ఆదాయం గండి పడుతోందన్నారు.

రాజవొమ్మంగి సీఐగా గౌరీశంకర్



రాజవొమ్మంగి జూలై 28(ఆంధ్రజ్యోతి): రాజవొమ్మంగి సీఐగా ఎస్.గౌరీశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన సన్యాసినాయుడు రంపచోడవరం సీఐగా బదిలీ అయ్యారు. రాజవొమ్మంగి, జడ్డంగి ఎస్ఐలు నరసింహమూర్తి, చిన్నబాబు, పోలీస్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

నేడు ఆశ వర్కర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు

రంపచోడవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి):ఏజెన్సీలో ఖాళీగాఉన్న ఆశ వర్కర్ల పోస్టులకు దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు మంగళవారం కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామనిసబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ అన్నారు. 33ఆశ వర్కర్ల పోస్టులకు ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందన్నారు.



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులో గల ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్న క్యాంటీన్‌లో సోమవారం గోకవరం మండలం వెదురుపాకకి చెందిన టీడీపీ సీనియర్ నేత పిల్లా అర్జున్ సారధి (చంటిబాబు), గోకవరం మండల ఐటీడీపీ చాంపియన్ బత్తుల శ్రీనివాస సారంగదరుడు (ఎస్.బాబు) ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం జరిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శ

గండేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలం బొర్రపాలెం గ్రామానికి చెందిన నామల రఘు, మల్లేపల్లిలో చింతపల్లి పెద్ద వీరబ్బాయి, భోగాది కృష్ణ, దుళ్ళ రామారావు ఇటీవల మరణించడంతో వారి కుటంబాలను సోమవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, గండేపల్లి మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, మాజీ జడ్పీటీసీలు యర్రశెట్టి బాజ్జి, పల్లపు సుబ్బారావు, కాటేపల్లి భద్రరావు, చింతప్లి భద్రరావు, తెలగరెడ్డి భద్రరావు, తణుకు దుర్గయ్య, దార్లంక శ్రీను, ఇంటి సత్యనారాయణ, తలారి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

యనమలను కలసిన అన్నవరం దేవస్థానం చైర్మన్



అన్నవరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడును సోమవారం అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ మర్యాద పూర్వకంగా కలిశారు. దేవస్థానంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఆయనకు వివరించారు. వచ్చే నెలలో పూర్తిస్థాయి పాలకమండలి ఏర్పాటు కానున్నట్టు యనమల చైర్మన్‌కు తెలిపారు. ఇటీవల దేవస్థానంలో వరుస వివాదాలపై చర్చకు వచ్చినట్టు సమాచారం. యనమలకు చైర్మన్ స్వామివారి ప్రసాదం అందజేశారు.

బడిదారి బాగుపడింది!

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మురుగు తొలగించి కంకరబూడిదతో చదును చేసిన రహదారి

తొండంగి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): దారి ఇలా - బడికి వెళ్లేదెలా శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. సీతారాంపురం ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలేక చిన్నారులు పడుతున్న ఇబ్బందులపై ప్రచురితమైన వార్తపై స్థానిక ఎమ్మెల్యే యనమల దివ్య, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈ శివాజీ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. రూ. రెండు లక్షల నిధులతో సుమారు 20 మీటర్ల మేర సిమెంట్ రహదారి నిర్మించి మురుగు పోయేందుకు ఇరువైపులా డ్రైన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం మురుగు శుభ్రపరిచి కంకరబూడిదతో చదును చేశారు. దీనిపై సిమెంట్ రోడ్, ఇరువైపులా డ్రైన్ నిర్మించనున్నారు.

మృత్యుంజయ హోమం



కిర్లంపూడిలో మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాలని కిర్లంపూడి సంత మార్కెట్ రోడ్‌లో ఉన్న వినాయకుని ఆలయంలో సోమవారం వర్తక సంఘ సభ్యులు మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. ఇందులో ముద్రగడ సతీమణి పద్మావతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

కారులో మహిళ ప్రసవం



పసి బిడ్డతో సారిక

ప్రత్తిపాడు, జూలై 28 (ఆంధ్ర జ్యోతి): రాచపల్లికి చెందిన మడికి చిన బాబు భార్య మడికి సారిక నెలలు నిండడంతో డెలివరీ కోసం అదే గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీనివాస్ (బంకు శ్రీను)ను సంప్రదించారు. అయితే శ్రీనివాస్ తన కారులో ప్రత్తిపాడు ఆసుపత్రికి డెలివరీ కోసం సారికతో పాటు ఆమె బంధువులతో కలిసి బయల్దేరారు. రాచపల్లి దాటిన తరువాత పోలవరం కాలువ వద్దకు చేరుకునేసరికి సారికకు నొప్పులు తీవ్రం కావడంతో ఆమె కారులోనే పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వైస్ ఎంపీపీ తన కారులోనే ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డకు వైద్యసేవలు అందించారు.

టీడీపీలో గోవిందరాజులు చేరిక

తునిరూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం పాటు టీడీపీలో కొనసాగి వైసీపీలోకి వెళ్లిన దొండవాకకు చెందిన జగన్నాథ గోవిందరాజులు మళ్లీ యనమల సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, మండలాధ్యక్షుడు అబ్బాయి, సర్ల బోడయ్య, గంటల చిన్నారావు ఉన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

తుని ఎమ్మెల్యే యనమల దివ్య



బిళ్లనందూరు ప్రజాదర్బార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే యనమల దివ్య

కోటనందూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో ఆధునీకరించి రైతులను ఆదుకుంటామని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. సోమవారం బిళ్లనందూరు గ్రామంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. సభలో ఆమె మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు గాడిరాజు బాబు, పోతల సూరిబాబు బైలపూడి శ్రీరామమూర్తి, మతిరెడ్డి బాపిరాజు, తహశీల్దార్ పీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు: టీడీపీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీకి చెందిన ఇద్దరు వార్డు మెంబర్లతో సహ 21 కుటుంబాలు టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ చిటికెల సత్యనారాయణ, అల్లు త్రిమూర్తులు ఆధ్వర్యంలో తుని ఎమ్మెల్యే దివ్య సమక్షంలో టీడీపీలో చేరారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు అందించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దూసుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, గాడి రాజుబాబు, సుర్ల లోవ రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు పోతల సూరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకంరెడ్డి రమేష్, డి.చిరంజీవి రాజు, పెనుముచ్చు నాగేశ్వరరావు, షేక్‌నవాబ్ జానీ, వెలగా వెంకటకృష్ణారావు, లగుడు సత్యనారాయణమూర్తి, రుత్తల శ్రీనివాస్, సి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు 'శ్రీ ప్రకాష్' విద్యార్థుల ఎంపిక

తునిరూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌లో ఈనెల 25 నుంచి 27 వరకూ వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్, సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీల్లో అండర్-14, అండర్-19 విభాగాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఒక్కొక్క జట్టు రూ.10000 నగదు బహుమతి పొందడమే కాకుండా సెప్టెంబర్ 13 నుంచి 16 వరకూ నారాయణ వరల్డ్ స్కూల్, జముహార్, బీహార్‌లో జరిగే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ మూడేళ్లుగా సీబీఎస్ఈ క్లస్టర్-7 కబడ్డీ పోటీల్లో అండర్-19 విభాగంలో శ్రీప్రకాష్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి ప్రథమస్థానంలో నిలుస్తున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వికె నరసింహారావు, సీనియర్ ప్రిన్సిపాల్ ఎమ్‌వివిఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, కోచ్ లక్ష్మణ్, చిన్నరాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.



కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కళాకారులకు 'ఎస్పీ' అవార్డు ప్రదానం

జగ్గంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కళాకారులకు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డు ప్రదాన ఉత్సవ కార్యక్రమం జగ్గంపేట సాయి బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వందన యూత్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పులి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. వంద మంది కళాకారులకు అవార్డును ప్రదానం చేశారు. సీనియర్ ఎన్జీవో బోడపాటి కాంతం, కూటమి నాయకురాలు చల్లా రాజ్యలక్ష్మి, క్యాండిల్ యూత్ వాలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జుత్తుక నాగేశ్వరరావు, మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరరావు, కాయల మణికంఠ మ్యూజిక్ మాస్టర్ ముసలి విజయభాస్కర్, సింగర్ సుజాత, రత్న, సరిపల్లి రమణ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు ఉచిత వైద్య శిబిరం

రౌతులపూడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులకు సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాఘవపట్నం సచివాలయం పరిధి గ్రామాలైన జల్దాం, దబ్బాది, చాకిరేవులపాలెం గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రస్తుత సీజన్‌లో జ్వరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. బలరామపురం గ్రామంలో 104 సిబ్బంది వైద్యశిబిరం నిర్వహించారు.



గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు శ్రీకాంత్

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా : ఎమ్మెల్యే

తునిరూరల్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేద మధ్యతరగతి కుటంబాలకు అండగా నిలుస్తుందని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. నియోజకవర్గంలో పలువురు ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఎమ్మెల్యే సిఫారసుతో సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందింది. రూ.10 లక్షల 71 వేల నగదు చెక్కులను ఎమ్మెల్యే దివ్య తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

శ్మశాన వాటికలో భవన నిర్మాణానికి వినతి

అలాగే తుని మున్సిపాలిటీ పరిధిలో హిందూ శ్మశానవాటికలో బ్రాహ్మణులకు ప్రత్యేక భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని భార్గవ బ్రాహ్మణ సేవా సమితి, వాగ్దేవి పురోహితుల సంఘ సభ్యులు ఎమ్మెల్యే యనమల దివ్యకు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న షెడ్లు శిథిలావస్థకు చేరాయని, కొత్తవి నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు చొరవ చూపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. భార్గవ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు ఏరంకి నూకరాజు, కార్యదర్శి కొడుకుల నాగభూషణం, నూకల రమేష్, తేజోమూర్తుల గిరి, ఎంఎస్ శాస్త్రి, ఎం శ్రీనివాస్, ఆచల్ల కిరణ్ తదితరులు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దివ్య

'చారుమజుందార్ స్ఫూర్తితో విప్లవ పోరాటాలు'



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న బుగతా బంగార్రాజు

ప్రత్తిపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఎంఎల్ లిబరేషన్ వ్యవస్థాపకుడు చారుమజుందార్ స్ఫూర్తితో విప్లవ పోరాటాలు నిర్వహించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యుడు వి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులోని లయన్స్ కమ్యూనిటీ హాల్ వద్ద సోమవారం చారుమజుందార్ 53వ వర్ధంతిని నిర్వహించారు. చారుమజుందార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో వారు మాట్లాడుతూ పేద ప్రజలపై జరిగే అణచివేతలు, దౌర్జన్యాలకు కామ్రేడ్ చారు మజుందార్ అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయన విప్లవ శక్తి పోరాటాల దిశా నిర్దేశాలను ముందుకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలు, నాయకులు కృషిచేయాలని కోరారు. సమావేశంలో లిబరేషన్ నాయకులు ఏగుపాటి అర్జునరావు,రేచట్ల సింహాచలం, మానుకొండ లచ్చబాబు, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఉదయ్‌కిరణ్, గొడగు సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు కె.జనార్దన్, వేమన, అప్పలరాజు, లిబరేషన్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'పోటీని ఎదుర్కొనేలా సిద్ధం కావాలి'



మాట్లాడుతున్న సతీష్ రెడ్డి

గండేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో గల ఎంబీఏ, ఎంసీఏ బీబీఏ, ఫోరెన్సిక్ విభాగాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులకు సోమవారం నుంచి తరగతులను ప్రారంభించారు. తల్లిదండ్రుల సమావేశంలో ప్రోచాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలను నిరంతరం గుర్తెరిగి మసులుకోవాలన్నారు. ప్రపంచస్థాయి పోటీని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే ఆదిత్య స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు ప్రకృతి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ రవి తంగజం, అసిస్టెంట్ డీన్ డాక్టర్ బి.సౌజన్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ బి.కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బొర్రపాలెం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న మల్లేపల్లికి, ఇండస్ట్రీస్‌కి మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. గండేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గండేపల్లి, సింగరంపాలెం, రామయంపాలెం గ్రామాలకు కూడా విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



ఏలేశ్వరంలో సంబరాలు జరుపుకుంటున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు

టీడీపీ శ్రేణుల సంబరాలు

ఏలేశ్వరం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సంయుక్త కమిటీ స్త్రీ, శిశు, వికలాంగులు, వృద్ధుల కమిటీ సభ్యురాలిగా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను నియమించడంపై పట్టణంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. కౌన్సిలర్ అలమండ చలమయ్య నేతృత్వంలో నగర పంచాయతీ కార్యాలయంలో స్థానికులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బూర్లు సత్తిబాబు, వైభోగుల సుబ్బారావు, బెల్లాని శ్రీను, బి.చిరంజీవి, కె.వాసు, జామి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న నవీన్ కుమార్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

జగ్గంపేట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికి సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ తెలిపారు. గోకవరంలో ఆర్యవైశ్య కళ్యాణ మండ పంలో ఏర్పాటు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. గోకవరంలో సుమారు 25 మందికి రూ.14,81,461 చెక్కులను ఆయన అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రౌతులపూడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని రౌతులపూడి ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు అన్నారు. మూలగపూడిలో జిల్లా పరిషత్ హైస్కూల్ నందు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థుల ఉద్దేశించి ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

పీజీఆర్ఎస్‌కు రెండు అర్జీలు



పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులు

గండేపల్లి, జూలై28 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. రెవెన్యూసమస్యలకు సంబంధించి రెండు అర్జీలు వచ్చినట్టు ఎంపీడీవో కె.చంద్రరావు, తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, వెటర్నరీ డాక్టర్ పి.శ్రీనివాస్, ఏపీఎం సన్యాసిరావు, ఏపీవో కృష్ణంరాజు, ఐసీడీఎస్ సూపర్వైజర్ నాగపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి జరిమానా

కిర్లంపూడి, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని సోమవారం ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరచగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.90 వేలు జరిమానా విధించినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు.

స్వర్ణ పంచాయతీలుగా గ్రామ పంచాయతీలు

ప్రత్తిపాడు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీలుగా గ్రామ పంచాయతీలను తీర్చిదిద్దే చర్యలు చేపట్టామని డిప్యూటీ ఎంపీడీవో కాశీ విశ్వనాథ్ చెప్పారు. ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణ పంచాయతీలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీలోని ఇంటి పన్నులు, నీటిపన్నులు, వేలంపాటల, ఇతర ఆదాయ వసూలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈనెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేసి స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యదర్శు బర్రే వీరబాబు, నాగార్జున, తేజప్రసాద్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి

ప్రత్తిపాడు, జూలై28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం కోరారు. గజ్జనపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.